


www.aksharamtelugudaily.com

సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

గురువారం 23 మే 2024 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12 సంపుటి : 07 సంచిక : 63 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## నేడు తెలంగాణ పర్యటనకు ప్రియాంక గాంధీ



# 3వేల కోట్ల రూపాయలతో..
# పంటల బీమా..

- సన్న రకాల సాగును ప్రోత్సహించేందుకే బోనస్
- మున్ముందు దొడ్డు రకం వడ్లకూ..హామీలు పూర్తి చేయకుంటే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగం: తుమ్మల
- రేషన్‌గా సన్న బియ్యం మా లక్ష్యం
- భవిష్యత్తులో దొడ్డు రకం వడ్లకూ ఇస్తాం
- కేసీఆర్ పాలనలో రైతులను కాల్చుకుతిన్నారు: తుమ్మల

**హైదరాబాద్, మే 22 (అక్షరం న్యూస్):**
కేసీఆర్ పాలనలో పంటల బీమా పథకం అమలుకు నోచుకోలేదని, తాము రూ.3వేల కోట్లతో ఆ పథకాన్ని అమలు చేయబోతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చిన ఘనత తమదేనని చెప్పారు. రాష్ట్రంలో సన్న రకాల సాగును పెంచేందుకే రూ.500 బోనస్ ప్రకటించామని తెలిపారు. గత ప్రభుత్వం సన్న బియ్యం పేరుతో దొడ్డు వడ్లకే పాలీష్ వేసి అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించిందని





## ఖాతాలు మూసి.. నగదు
# లాగేసుకుంటాయి
### ప్రధాని నరేంద్ర మోదీ



లఖ్‌నవూ, మే 22: ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే జనధన్ బ్యాంక్ ఖాతాలు మూసి వేసి అందులోని నగదు లాగేసుకొంటాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని శ్రావస్థిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. తన ప్రభుత్వ హయాంలో పేదవారి కోసం దాదాపు 50 కోట్లకు పైగా జనధన్ యోజన ఖాతాలను ప్రారంభించానని తెలిపారు.
ఆ ఖాతాలన్నీ ప్రతిపక్షాలు మూసి వేస్తాయని ప్రధాని మోదీ స్పష్టం చేశాయి. ప్రధానిగా తాను దేశంలో ప్రతీ గ్రామానికి విద్యుత్ సరఫరా తీసుకు వచ్చానన్నారు. అదే ప్రతిపక్షం అధికారంలోకి వస్తే మాత్రం ఆ యా గ్రామాలన్నీ విద్యుత్ కోతల ద్వారా చీకటిలోకి నెట్టేస్తాయని విమర్శించారు. ఇక ప్రతీ ఇంటికి తాను కుళాయి ద్వారా నీళ్లు అందించానని గుర్తు చేశారు. అయితే ఇంటికి దూరంగా నీటి కుళాయిలు ఏర్పాటు చేయ గల నైపుణ్యంలో ప్రతిపక్షాలు పేరు సంపాదించాయని చెప్పారు. ఇక 4 కోట్ల మంది పేద ప్రజలకు కోసం నిర్మించిన ఇళ్లు.. ఎస్పీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాళ్ల ఓటు బ్యాంక్‌కు కట్టబెడతారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఏం చేసినా.. దానికి విరుద్ధంగా చేయడం ఎస్పీ, కాంగ్రెస్ పార్టీల ప్రత్యేకత అని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే.. ప్రస్తుతం జైల్లో ఉన్న తీవ్రవాదులందరని.. ప్రధానమంత్రి తన నివాసంలో బిర్యానీ తినేందుకు ఆహ్వానిస్తారన్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల ర్యాలీలో పాల్గొంటున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌లపై ప్రధాని మోదీ వ్యంగ్య బాణాలు సంధించారు.

# మళ్లీ టోల్ బాదుడు

### జాతీయ రహదారులపై 5 శాతం చార్జీల పెంపు
### కేంద్ర సర్కార్ నిర్ణయం.. జూన్ 1 అర్ధరాత్రి నుంచి అమలు





### 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి కూడా యువతకు
# దూరమయ్యాం
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



### పోలీసుల అదుపులో మాచర్ల
# ఎమ్మెల్యే పిన్నెల్లి ?..
### పది సెక్షన్ల కింద కేసు నమోదు



### బంగాళాఖాతంలో
# మరో తుఫాన్!
### రాష్ట్రంలో మూడు రోజులు వర్షాలు
### వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ



### ఏపి కొత్త ప్రభుత్వంతో సఖ్యత
# కొనసాగిస్తాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తిరుమలలో తెలంగాణ తరపున కల్యాణ మండపం
- భక్తుల వసతి గృహం నిర్మిస్తాం..
- దీనిపై కొత్త ముఖ్యమంత్రితో చర్చిస్తాం..
- తిరుమలలో మీడియాతో రేవంత్ రెడ్డి



# 3వేల కోట్లతో పంటల బీమా..

గుర్తు చేశారు. పేదలకు మేలు చేయాలనే సంకల్పంతో రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేయాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర అవసరాలకు సరిపడా సన్న వడ్లను ఉత్పత్తి చేసుకునేందుకు బోనస్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు స్పష్టం చేశారు. భవిష్యత్తులో దొడ్డు రకం వడ్లకు కూడా ఈ పథకాన్ని అమలుచేస్తామని ప్రకటించారు.

ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రకటనలు మానుకోవాలని సూచించారు. రైతులు కూడా గత ప్రభుత్వం ఎలా పనిచేసింది? ప్రస్తు ప్రభుత్వం ఎలా పనిచేస్తున్నదో? ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను కాల్చుకుతిన్నది కేసీఆరేనని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడగొట్టి ఇంట్లో కూర్చోబెట్టారని తుమ్మల పేర్కొన్నారు. 2020లోనే రైతులకు బోనస్ ఇస్తామని ప్రకటించిన కేసీఆర్.. ఆ తర్వాత మూడేళ్లు అధికారంలో ఉండీ నయా పైసా ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పుడు తాము సన్న రకం ధాన్యానికి బోనస్ ఇస్తామంటే... బీఆర్ఎస్ నేతలు కొత్త నాటకాలకు తెరలేపారని దుయ్యబట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి హామీలన్నీ పూర్తి చేస్తామని, లేకపోతే ప్రజలను ఓట్లు అడగబోమని స్పష్టం చేశారు. కేసీఆర్ నిర్వాకం కారణంగా అస్తవ్యస్తమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీల అమలు ప్రక్రియను ప్రారంభించామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే కాంగ్రెస్ పాలనలో ధాన్యం సేకరణ వెయ్యి పాళ్లు నయమనే అభిప్రాయంతో తెలంగాణ రైతులు ఉన్నారని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు జిల్లాకో ఐఏఎస్ అధికారిని నియమించామని, ఈ సారి 4 లక్షల టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేస్తామని తెలిపారు. గతంలో క్వింటాల్‌కు 7–10 కిలోల వరకు తరుగు తీసి మిల్లర్లు దోపిడీ చేసే వారని, ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. గతంలో ధాన్యం డబ్బు చెల్లించడానికి 45రోజులు పట్టేదని, ఇప్పుడు 5 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నామని పేర్కొన్నారు.

వానాకాలం నుంచే పంటల బీమా

వానాకాలం సీజన్ నుంచి పంటల బీమా పథకాన్ని ప్రారంభించాలని యోచిస్తున్న సర్కారు.. ఎన్నికల కోడ్ ముగియగానే సంబంధిత నిధులు విడుదల చేసేందుకు కసరత్తు చేస్తోంది. వానాకాలం సీజన్ ప్రారంభం కావడానికి మరో మూడు వారాల నుంచి నెల రోజుల సమయం ఉంది. ఆలోపు పంటల బీమా పథకాన్ని పట్టాలెక్కించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి రూ. 3 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రీమియం పోగా, మిగిలిన ప్రీమియం చెల్లించేందుకు ఈ నిధులను వినియోగించనున్నారు. ఈ మేరకు బీమా కంపెనీలతో ఒప్పందాలు, ప్రీమియం నిర్ధారణకు వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా చేపట్టే క్రాప్ బుకింగ్ యాప్‌లో నమోదైతే చాలు... ఆ పంటలకు బీమా వర్తిస్తుంది. సుమారు 1.35–1.45 కోట్ల ఎకరాల్లో వానాకాలం పంటలు సాగయ్యే అవకాశాలున్నాయి. ఈ మొత్తం విస్తీర్ణానికి పంటల బీమా పథకాన్ని అమలు చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. పంటల బీమా పథకాన్ని మెరుగ్గా అమలు చేసేందుకు ఉమ్మడి జిల్లాల వారీగా అధికారులకు సదస్సులు నిర్వహిస్తున్నారు. ఏఈవోలు, ఏవోలు, ఏడీఏలు, డీఏవోలు, సీపీవోలు ఇతర అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ల ఆధ్వర్యంలో సదస్సులు కొనసాగుతున్నాయి. పంటల నమోదు ఎలా చేయాలి? గ్రామాల వారీగా వివరాల సేకరణ, క్రోడీకరణ, పంటల విస్తీర్ణం లెక్కలు ఎలా తీయాలి? తదితర అంశాలపై కసరత్తు చేస్తున్నారు. పంటలను ధ్రువీకరించుకోవడానికి... రైతుల నుంచి బయోమెట్రిక్ తీసుకోవాలనే అంశంపైనా చర్చ జరుగుతోంది.

## 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి కూడా యువతకు దూరమయ్యాం

నర్సంపేట : మా ప్రభుత్వ హయాంలో చేసిన మంచి పనులు చెప్పుకోలేక.. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి కూడా యువతకు దూరమయ్యాం. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పెంచి కూడా వారికి దూరమయ్యాం. ఇలా చేసింది చెప్పుకోలేక ఓడిపోయామన్నారు కేటీఆర్. నర్సంపేటలో ఏర్పాటు చేసిన వరంగల్ %–% నల్లగొండ %–% ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచార సభలో కేటీఆర్ పాల్గొని పార్టీ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా ప్రసంగించారు.

ఈ ఎన్నికలతో ఫలితంలో ప్రభుత్వం కూలిపోయేది లేదు. తారుమార అయ్యేది లేదు. 6 నెలల క్రితం అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. కేసీఆర్‌తో సహా అందరం ప్రతి నియోజవర్గంలో పర్యటించాం. దయచేసి మోసపోకండి.. గోసపడుతామని చెప్పాము. కానీ ప్రజలు కాంగ్రెస్ వాగ్దానాలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు. ఇప్పుడు బాధపడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

చదువుకున్న విద్యావంతులు కాంగ్రెస్ పాలన గురించి ఆలోచించాలని కోరుతున్నాను. ప్రస్తుతం వ్యవసాయం పరిస్థితి ఏంటో ఆలోచించండి. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అందమైన నినాదాలు ఎక్కడున్నాయో ఆలోచించండి. నాకు ఓటు వేస్తే 2 లక్షల రుణమాఫీ దస్త్రంపై డిసెంబర్ 9న తొలి సంతకం చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడు. అర్జంట్‌గా బ్యాంక్‌కు వెళ్లి 2 లక్షల రుణం తెచ్చుకోవాలని కూడా సూచించారు. డిసెంబర్ 9 పోయింది.. మరో పది రోజులు అయితే జూన్ 9 వస్తది. ఆరు నెలలు గడిచిపోతది. తొలిరోజే సంతకం చేస్తానని మోసం చేసిన రేవంత్ రెడ్డి నిలబెట్టిన అభ్యర్థి పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో ఆలోచించాలని గ్రాడ్యుయేట్లను కేటీఆర్ కోరారు.

రైతు భరోసా 15 వేలు ఇస్తా.. భూయజమాలకు కాదు కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తానని రేవంత్ నమ్మబలికాడు. రైతు కూలీలకు ఏడాదికి 12 వేలు ఇస్తానని అన్నాడు. కౌలు రైతులకు రైతు భరోసా రాలేదు. తొలిసారి మోసపోతే మోసం చేసినోడిది తప్పు. రెండోసారి కూడా వాడి చేతిలో మోసపోతే మనది తప్పు అయితదని కేటీఆర్ అన్నారు.





## తొలకరికి ముందే రైతుభరోసా ఇవ్వాలి

**తడిసిన వడ్లను యుద్ధప్రాతిపదికన కొనాలి**
**కొన్న వెంటనే సెంటర్ల నుంచి లిఫ్ట్ చేయాలి**
**ఒక్క మంత్రి అయినా కల్లాల్లో కనబడుతున్నరా?**
**బోనస్ ఇస్తామని మొండిచేయి చూపించారు**
**జనుము, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలేవీ?**
**పాస్‌బుక్‌లు లైన్‌లో పెట్టే దుస్థితి వచ్చింది**
**ఆగ్రోస్, పీఏసీఎస్ సెంటర్లలో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచాలి**
**చిన్నకోడూరులో వడ్ల కొనుగోలు కేంరద్రాన్ని సందర్శించిన హరీశ్‌రావు**

సిద్దిపేట, మే 22: వానకాలం సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభం కాకముందే, జూన్‌లోనే ఎకరానికి రూ.7,500 చొప్పున రైతుభరోసా నిధులు విడుదల చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా చిన్నకొడూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తడిసిన వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో మంత్రులంతా కల్లాల్లో తిరిగారని, ఇప్పుడు ఒక్క మంత్రి అయినా కల్లాల్లో కనబడుతున్నారా? అని ప్రశ్నించారు. మంత్రులు హైదరాబాద్‌లో కూర్చుని స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి వడ్లు కొనకపోవడంతో అవి వర్షాలకు తడుస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.

వడ్లు కొంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్నా, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని దుయ్యబట్టారు. చిన్నకోడూరులో తాము క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడు రైతులు 20 నుంచి 25 రోజులుగా ఇక్కడే ఉన్నామని చెప్పారని తెలిపారు. తడిసిన ధాన్యం కొంటామని ప్రభుత్వం చెప్తున్నా, అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం రైస్‌మిల్‌కు తీసుకెళ్తే తేమ శాతం ఉన్నదని, మొలకెత్తిందని చెప్పి ఒక సంచికి మూడు కిలోలు తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని తరుగు తీసేయకుండా వడ్లు కొనాలని, తక్షణమే తడిసిన వడ్లు కూడా కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇంకా 40% ధాన్యం కల్లాల్లో ఉన్నదని, వెంటనే యుద్ధ ప్రాతిపదికన లారీల సంఖ్యను పెంచి త్వరితగతిన వడ్లు కొనాలని కోరారు.

ఎన్నికల ముందు ఒకమాట

ఎన్నికలకు ముందు వడ్లకు రూ.500, మక్కలకు, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలా ఇవ్వకపోతే భవిష్యత్తులో రైతులు నిలదీస్తారని హెచ్చరించారు. సన్నవడ్లకు పెట్టుబడి ఎక్కువ, దిగుబడి తక్కువ, కాలపరిమితి ఎక్కువ కాబట్టి ఎవరూ పండించరని చెప్పారు. ఇంట్లో వాడుకునేందుకు మాత్రమే సన్నవడ్లను పండిస్తామని చాలామంది రైతులు చెప్తున్నారని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 3,38,389 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇందులో దొడ్డు రకం 3,21,469 ఎకరాల్లో, సన్నరకం 16,920 ఎకరాల్లో మాత్రమే పండించారని వివరించారు.

95% దొడ్డు వడ్లు, 5 శాతమే సన్నవడ్లు పండిస్తారని.. అవి కూడా ఇంటి కోసమే అని చెప్పారు. రైతులు ఎంతో కష్టపడి వరి పండిస్తే వడ్లు కొనకుండా తాత్సారం చేయడంతోపాటు బోనస్ ఇవ్వకుండా మొండిచేయి చూపారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో జనుము, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు దొరికే పరిస్థితి లేదని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్ని కావాలన్నా స్టాక్ ఉంచిందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎరువులు, విత్తనాల కోసం చెప్పులు లైన్‌లో పెట్టినట్టు, ఇప్పుడు మళ్లీ పాస్‌బుక్‌లు లైన్‌లో పెట్టే పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. వెంటనే పచ్చిరొట్ట విత్తనాలు ఆగ్రోస్ సెంటర్లలో, పీఏసీఎస్ సెంటర్లలో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### బంగాళాఖాతంలో
## మరో తుఫాన్!

హైదరాబాద్, మే 22 (అక్షరం న్యూస్): నైరుతి పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని అల్పపీడనం ఏర్పడినట్టు భారత వాతావరణ విభాగం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో వాయుగుండంగా మారనున్నది. సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల వరకు ఆవర్తనం విస్తరించింది. గురువారం ఉదయం నుంచి మధ్య బంగాళాఖాతంలో గంటకు 40–50 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నది. శుక్రవారం వరకు సముద్రం పరిస్థితి కూడా చాలా ఉధృతంగా ఉండే అవకాశం ఉందని నివేదికలు తెలిపాయి.

శుక్ర, శనివారాల్లో బాలాసోర్, ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు మేదినీపూర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. శనివారం రాత్రి ఒడిశా, పశ్చిమ బెంగాల్ మధ్య తీరం దాటుతుందని, తుఫానుగా మారి ఒడిశాతీరం దిశగా పయనించే అవకాశం కూడా ఉన్నదని చెప్పారు. రాష్ట్రంలో రాబోయే మూడు రోజులు వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

## మళ్లీ టోల్ బాదుడు

హైదరాబాద్, మే 22 (అక్షరం న్యూస్): దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై టోల్ చార్జీలు మళ్లీ పెరగనున్నాయి. ఏటా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి టోల్ చార్జీలు పెరుగుతాయి. ఈసారి లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెంపు వాయిదా పడింది. జూన్ 1న ఆఖరి విడత పోలింగ్ ముగియనున్నది. అదేరోజు అర్ధరాత్రి నుంచి కొత్త చార్జీలు అమల్లోకి రానున్నాయి. మొత్తం ఐదు శాతం మేర టోల్‌చార్జీలను పెంచనున్నట్టు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు తెలిపారు.

పెరగనున్న టోల్ చార్జీల ప్రకారం యాదాద్రి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద కార్లు, జీపులు, వ్యాన్లకు రెండు వైపులా ప్రయాణానికి రూ.5, చిన్న లారీపై రూ.10 చొప్పున పెరిగాయి. వాణిజ్య, భారీ గూడ్స్ లారీలకు రూ.15 చొప్పున చార్జీలు పెరుగుతాయి.

తెలుగు రాష్ట్రాల్లో ఉన్న హైదరాబాద్–విజయవాడ (65), హైదరాబాద్–వరంగల్ (163) జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా పరిధిలోని చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలోని చిల్లకల్లు (నందిగామ), వరంగల్ హైవేపై బీబీనగర్ మండలం గూడూరు టోల్ ప్లాజాలు ఉన్నాయి.

### పోలీసుల అదుపులో మాచర్ల
## ఎమ్మెల్యే పిన్నెల్లి ?..

అమరావతి : ఈనెల 13న ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం రెంటచింతల పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎం యంత్రాలను ధ్వంసం చేసిన కేసులో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి , అతడి సోదరుడి కోసం రెండు రాష్ట్రాల పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.
ఇందులో భాగంగా తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ సమీపంలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఎమ్మెల్యేను ఓ కంపెనీ గెస్ట్‌హౌస్‌లో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే ఇంకా పోలీసులకు పట్టుబడ లేదని రెండు రాష్ట్రాల పోలీసులు స్పష్టం చేశారు. అయితే ఎమ్మెల్యే కారు డ్రైవర్‌ను, అనుచరులను అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.
ఈ ఘటనలో ఇప్పటికే పిన్నెల్లిని ఏ1గా ఎఫ్ఐఆర్(%ఖీ×=) %?లో చేర్చారు. ఐపీలోని143, 147, 448, 427, 353, 452, 120బి, తోపాటు ప్రజాప్రాతినిధ్య చట్టం, పీడీపీపీ చట్టం, ఆర్పీ చట్టం 131, 135లోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. విధ్వంసానికి పాల్పడ్డ ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కమార్ మీనా సీరియస్ స్పష్టం చేశారు. ఏపీలో మొత్తం 9 ఈవీఎంలు ధ్వంసం కాగా మాచర్లలోనే 7 ఈవీఎంలను ధ్వంసం చేశారని ఆయన వెల్లడించారు. ఈవీఎంలను ధ్వంసం చేసినా డేటా భద్రంగా ఉందని, దీంతో కొత్త ఈవీఎంలతో పోలింగ్‌ను కొనసాగించామని తెలిపారు. ఘటన జరిగిన మరుసటి రోజే ఆధారాలను పోలీసులకు అప్పగించామని పేర్కొన్నారు.

### ఎపి కొత్త ప్రభుత్వంతో సఖ్యత
## కొనసాగిస్తాం

తిరుమల : ఎపిలో ఏర్పడబోయే నూతన ప్రభుత్వ సహకారంతో , ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధి సాధించేలా తన వంతు కృషి చేస్తానని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.. ఇవాళ ఉదయం తిరుమల శ్రీవారిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.అనందరం ఆలయం వెలుపల రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, త్వరలో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేయ నూతన ప్రభుత్వ సహకారంతో, ఉభయ రాష్ట్రాల్లో సమస్యల పరిష్కారానికి, ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. అలాగే తిరుమలలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున కళ్యాణ మండపం, వసతి గృహం ఏర్పాటుకు, నూతన ప్రభుత్వ సహకారం తీసుకుంటామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వాతావరణం అనుకూలించి, రైతాంగం సస్యశ్యామలం కావాలని కోరారు.

## నేడు తెలంగాణ పర్యటనకు ప్రియాంక గాంధీ

రంగారెడ్డి జిల్లా: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కాంగ్రెస్ (%జశీఅస్త్రతీవం౦%) అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాండూర్ ( కామారెడ )లలో పర్యటించనున్నారు. ఈరోజు ఉదయం 10 గంటలకు పఠాన్‌చెరు కార్నర్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 1 గంటకు తాండూర్ జన జాతర సభకు ప్రియాంక గాంధీ, రేవంత్ రెడ్డి హాజరవుతారు. సాయంత్రం 3.15 గంటలకు ప్రియాంక గాంధీతో కలిసి కామారెడ్డిలో రోడ్ షోలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. కాగా హోరాహోరీగా సాగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరింది. శనివారం సాయంత్రంతో ప్రచార గడువు ముగియనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు, వారి తరపున స్టార్ క్యాంపెయినర్లు ప్రచారాన్ని హోరెత్తించారు.

## రేపు రాష్ట్రవ్యాప్తంగా విత్తన మేళా

**విక్రయానికి 16 పంటల్లో 67 రకాలు**
**పరిశోధన స్థానాలు, కేవీకేల్లో నిర్వహణ**

హైదరాబాద్, మే 22: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతుల కోసం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా విత్తన మేళా నిర్వహించనున్నట్టు పరిశోధనా సంచాలకుడు డాక్టర్ రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేయనున్న ఈ మేళాను హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

అదే రోజున విశ్వవిద్యాలయ పరిధిలోని జగిత్యాల, పాలెం, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాల్లో, అన్ని కృషి విజ్ఞాన కేంద్రాల్లో విత్తన మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ మేళాల్లో 16 పంటల్లో 67 రకాలకు చెందిన దాదాపు 12 వేల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు అమ్మకానికి అందుబాటులో ఉంచనున్నట్టు పేర్కొన్నారు. ఈ మేళాలో వర్సిటీలో రూపొందించిన వివిధ వంగడాలను ఉంచుతామని తెలిపారు. వరిలో 27 రకాలు ఉన్నాయని, మెట్ట, అపరాలతో పాటు గడ్డి విత్తనాలనూ అందుబాటులో ఉంచనున్నట్టు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు.

# శాసనమండలి ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి...

### దాసరి హరిచందన ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి...

మహబూబాబాద్ /గార్ల /మే 22/అక్షరం న్యూస్...




వరంగల్– ఖమ్మం– నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్గొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ కు తెలియజేశారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుండి వరంగల్– ఖమ్మం– నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఏర్పాట్లపై నల్గొండ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన తోపాటు, ఉప ఎన్నికలు జరిగే 12 జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్లు,ఏఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఐ.డి.ఓ.సి వి.సి హాలు నుండి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ తో కలిసి పాల్గొన్నారు.



ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికను ఆషామాషిగా తీసుకోవద్దని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, ఎన్నికలలో ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం సరఫరా చేసిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్, ఇండెలిబుల్ ఇంకు లు మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు ముగిసినందున ఎం ఎల్ సి ఎన్నికలలో ఓటరు ఎడమ చేయి మధ్య వేలుకు ఇండెలిబుల్ ఇంక్ మార్కు చేయాలని, ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బయట ప్రదర్శించాలని, అదేవిధంగా ఓటర్లు ఓటు ఎలా వేయాలో ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని సూచించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మే 27 న ఉన్నందున, నిర్వహణకు ముందు,పోలింగ్ అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మహబూబాబాద్ ఆర్డీవో అలివేలు, తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు లకి ఎన్నికల కమిషన్ గైడ్లైన్స్ ,మరియు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తగు సలహాలు సూచనలు ఇచ్చారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జడ్పీ సీఈవో నర్మద, ఫిషరీస్ ఏడి సురేష్, జిల్లా హార్టికల్చర్ అధికారి మరియన్న, మరియు సంబంధిత నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ భూనిలా సహిత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణం మహోత్సవం...!



















రాజన్న సిరిసిల్ల /వేములవాడ, మే - 22 (అక్షరం న్యూస్):
రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం నాంపల్లి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం రోజునఅంగరంగ వైభవంగా శ్రీ భూనిలా సహిత శ్రీ లక్ష్మి నరసింహస్వామి కళ్యాణం...కన్య దాతలుగారాచకొండ రామ చార్యులు సంధ్య రాణి .రాజన్న ఆలయ స్థాన చార్యులు అప్పల బీమా శంకర్ ఆధ్వర్యంలో అర్చకులు విజయసింహ చారి రామకృష్ణ చారి హర్షవర్ధన చారి రాజన్న ఆధ్వర్యంలో వేద మంత్రాలతో కళ్యాణతంతు నిర్వహించారు.ఈ కార్య క్రమంలో ఆలయ ఏఈవో శ్రీనివాస్, ఈఈ రాజేష్, డిఈ రఘునందన్ సుపరిడెంట్లు సిరిగిరి శ్రీ రాములు,అల్లె శంకర్, నాంపల్లి గుట్ట ఆలయ ఇన్చార్జి నరేందర్ ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు. కళ్యాణ వేడుకల్లో సుమారు 1500 పైగా భక్తులు పాల్గొనగా కళ్యాణ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# అమెరికా వెళ్లే విద్యార్థులకు గుడ్ న్యూస్

స్టూడెంట్ వీసా సెషన్ మరో రెండు వారాలు పొడిగింపు
నిమిషాలల వ్యవధిలో అన్ని వీసా స్లాట్ లు బుకింగ్
విద్యార్థులలో ఆందోళనలు.. స్లాట్ పెంచాలని వినతి
స్పందించిన హైదరాబాద్ అమెరికన్ కాన్సులేట్ జనరల్
మరో రెండు వారాల పాటు వీసా కౌన్సిల్ కొనసాగిస్తామంటూ ప్రకటన



అమెరికాలో ఉన్నద చదువుకోసం వెళ్లే విద్యార్థులకు శుభవార్త వినిపించించి ఆ దేశ కౌన్సిల్ జనరల్%%. వీసా బుకింగ్ స్లాట్ నిమిషాల వ్యవధిలో భర్తీ కానుండటంతో కౌన్సిల్ పిరియడ్ ను మరో రెండు వారాలు పెంచినట్లు ప్రకటించింది.. వివరాలలోకి వెళితే అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్లే విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. విద్యార్థులకు ఆ దేశం జారీ చేసే స్టూడెంట్ వీసా (ఎఫ్–1) లకు డిమాండ్ చాలా ఎక్కువ. దీంతో వాటి కోసం విడుదల చేసే ఇంటర్వ్యూ స్లాట్ లకూ విపరీతమైన డిమాండ్ నెలకొంది. సోమవారం ఎఫ్–1 వీసా స్లాట్లు ఆన్ లైన్ లో విడుదల చేయగా.. కేవలం ఐదు నిమిషాల్లోనే ఏకంగా పదివేల స్లాట్లు బుక్ అయ్యాయి.

దీంతో అమెరికా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్న విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే యూనివర్సిటీల అడ్మిషన్ సంపాదించిన పలువురు విద్యార్థులు.. ఎఫ్–1 వీసా ఇంటర్వ్యూ కోసం స్లాట్ బుక్ చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది విద్యార్థులు ఏకంగా ఆరు నెలల నుంచి వీసా ఇంటర్వ్యూ కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. వీసా స్లాట్లు విడుదల చేసిన ప్రతిసారీ నిమిషాల వ్యవధిలోనే బుక్ అవుతున్నాయని చెబుతున్నారు.

వచ్చే విద్యా సంవత్సరంలో అమెరికాలోని వివిధ యూనివర్సిటీలలో చేరేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ వీసా ఇంటర్వ్యూ విషయంలోనే ఇబ్బంది పడుతున్నామని వివరించారు. ఇంటర్వ్యూ కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవడం గగనమైపోయిందని, స్లాట్లు దొరకడంలేదని వాపోయారు. తాజాగా సోమవారం కూడా ఐదు నిమిషాల్లో పది వేల వీసా స్లాట్లు బుక్ కావడంతో విద్యార్థుల్లో టెన్షన్ నెలకొంది. దీంతో పలువురు విద్యార్థులు తమ పరిస్థితిని వివరిస్తూ వీసా స్లాట్లు పెంచాలంటూ అమెరికన్ ఎంబసీకి ఆన్ లైన్ లో రిక్వెస్ట్ పెడుతున్నారు. ఈ విజ్ఞప్తులపై హైదరాబాద్ లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ ట్విట్టర్ లో స్పందించారు. స్టూడెంట్ వీసా సెషన్ ను రెండు వారాల పాటు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఏడు లక్షా 50 వేల మంది విద్యార్థులకు స్టూడెంట్ వీసాలు ఇవ్వనున్నట్లు ఇప్పటికే అమెరికా ఇమ్మిగ్రేషన్ శాఖ ప్రకటించింది.. అందుకనుగుణంగా ఇండియాలోని చెన్నై, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ లో ఉన్న అమెరికన్ కాన్సులేట్ లో వీసా ఇంటర్వ్యూలను మరో రెండు వారాల వరకు కొనసాగించనున్నట్లు ఒక ప్రకటన వెలువడింది.

# శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికను ఆషామాషీగా తీసుకోవద్దు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్






కేసరి ఖమ్మం మే 22 (అక్షరం న్యూస్)
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ బుధవారం హైదరాబాద్ నుండి వరంగల్– ఖమ్మం– నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఏర్పాట్లపై ఉప ఎన్నికలు జరిగే 12 జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్లు, ఏఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో సిఇఓ సమీక్షించారు. నూతన కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికను ఆషామాషీగా తీసుకోవద్దని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, ఎన్నికలలో ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం సరఫరా చేసిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్, ఇండెలిబుల్ ఇంకులు మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు ముగిసినందున ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటరు ఎడమ చేయి మధ్య వేలుకు ఇండెలిబుల్ ఇంక్ మార్కు చేయాలని, ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బయట ప్రదర్శించాలని, అదేవిధంగా ఓటర్లు ఓటు ఎలా వేయాలో ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జడ్పీ సి.ఇ.ఓ. వినోద్, డిఆర్డిఓ సన్యాసయ్య, ఆర్డీవోలు జి. గణేష్, ఎల్. రాజేందర్, కలెక్టరేట్ ఎ.ఓ. అరుణ, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, మదన్ గోపాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు

## ఖమ్మం లోక్ సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్



**ఖమ్మం, మే 22 (అక్షరం న్యూస్)**

లోక్ సభ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు చేసినట్లు ఖమ్మం లోక్ సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. లోకసభ ఓట్ల లెక్కింపు ను ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. లోకసభ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్ల 7, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుకు ఒకటి, మొత్తం 8 హాళు ఏర్పాటుచేసినట్లు, ఒక్కో హాల్లో 14 టేబుళ్ల చొప్పున, ఒక్క ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ లో 355 పోలింగ్ కేంద్రాలు వున్నందున అక్కడ 18 టేబుళ్లు ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. పోటీచేసిన అభ్యర్థులు 117 మంది ఏజెంట్ల ను నియమించవచ్చని, ఏజెంట్ల వివరాలు ఫారం 18 లో సమర్పించాలని ఆయన అన్నారు. ఏజెంట్ల వివరాలు గురువారం సాయంత్రం లోగా సమర్పించాలన్నారు. జూన్ 4 న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుందని, ఉదయం 5 గంటలకు ఇవిఎం స్ట్రాంగ్ రూంలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీ అభ్యర్థుల సమక్షంలో తెరవడం జరుగుతుందని ఆయన అన్నారు. పోటీ అభ్యర్థులు, చీఫ్ ఏజంట్లు సమయానికికౌంటింగ్ కేంద్రానికి చేరాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6.30 గంటలకల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరాలన్నారు. ఏజెంట్లు పాసుల కొరకు 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు ఇవ్వాలన్నారు. కౌంటింగ్ కేంద్రం లోకి మొబైల్ ఫోన్ల అనుమతి లేదని ఆయన అన్నారు. ఈ నెల 13న పోలింగ్ అనంతరం ఇవిఎం యంత్రాలను శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ కు తరలించి, 3 అంచెల పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు ఆయన అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు స్ట్రాంగ్ రూంలను సందర్శించవచ్చని ఆయన అన్నారు.

వరంగల్-ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నెల 27 న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో 83879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదైనట్లు, జిల్లా వ్యాప్తంగా 118 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేసినట్లు, పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్నట్లు ఆయన అన్నారు. బ్యాలెట్ పేపర్ల ద్వారా పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ కొరకు రిజర్వ్ తో సహా 129 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. 15 సెక్టార్ లు ఏర్పాటుచేసి, తహశీల్దార్లను సెక్టార్ అధికారులుగా నియమించినట్లు ఆయన అన్నారు. ఈ నెల 26న ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటుచేయనున్నట్లు, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు నల్గొండ లోని స్ట్రాంగ్ రూంకు పంపనున్నట్లు, కౌంటింగ్ జూన్ 5 న నల్గొండలో జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో 52 మంది అభ్యర్థులు, నోటా తో కలుపుకుని 53 ఉన్నట్లు, ప్రాధాన్యత క్రమంగా తమ ఓటును వేయాల్సి ఉంటుందని, ఓటు వేయాల్సిన ప్రక్రియపై కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు, పోటీ అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చెయ్యాలి

## రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య

**వరంగల్ జిల్లా మే 22 (అక్షరం న్యూస్)**

వరంగల్, జిల్లా సాధారణ లోకసభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని, ఇందులో ఎటువంటి లోటుపాట్లకు తావీయరాదని రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా తో కలసి కౌంటింగ్ ఏర్పాట్లు, లెక్కింపు బందోబస్తు పై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్‌కోసం అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలన్నారు. వరంగల్ ఎస్సి పార్లమెంట్ పరిధిలోని 7 అసంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ యెనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లో జరగనున్న దృష్ట్యా కౌంటింగ్ కేంద్రాల్లో బారికేడింగ్ పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు.మీడియా సెంటర్ కు ప్రత్యేక హాల్ వసతులు టెలిఫోన్ ఎల్ఈడి స్క్రీన్ ఇంటర్నెట్ ఏర్పాటు చేయాలన్నారు. రవాణా కోసం డైరీ కేసులు ఏర్పాటు చేసుకోవడం ప్రవేశద్వారం మళ్ళింపు కోసం భోజన, టాయిలెట్స్ సక్రమంగా ఏర్పాట్లు

ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేసుకోవాలన్నారు.గుర్తింపు కార్డులు కలిగిన వ్యక్తులను మాత్రమే అనుమతించాల న్నారు.ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్స్ వద్దనే కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తొలుత ఈవీఎంలను కౌంటింగ్ రూములకు షిఫ్ట్ చేసి కౌంటింగ్ ప్రారంభిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు ప్రత్యేక టేబుల్‌లను ఏర్పాటు చేసి తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపును పూర్తి చేస్తామన్నారు. కౌంటింగ్ సెంటర్‌లో ప్రతి అసంబ్లీ సెగ్మెంట్కు టేబుల్స్ ఏర్పాటు చేసి ఇందుకు సంబంధించిన సిబ్బంది విధులు కేటాయింపునకు మూడు దశల్లో ర్యాండమైజేషన్లు నిర్వహించి టేబుల్ వైజ్ సిబ్బందిని మూడో ర్యాండమైజేషన్లో ఎంపిక చేసయనున్నట్లు తెలిపారు.వీరిలో కౌంటర్ సూపర్‌వైజర్స్, మైక్రో అబ్జర్వర్లు, కౌంటర్ అసిస్టెంట్‌లు ఉంటారని తెలిపారు. వీరందరికీ గుర్తింపు కార్డులను జారీ చేస్తామని, అలాగే సంబంధిత రాజకీయ పార్టీల ఏజెంట్లకు కూడా గుర్తింపు కార్డులను జారీ చేస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ప్రవేశించే వారికి సెల్‌ఫోన్ అనుమతి ఉండదని, ముందుగానే సెల్‌ఫోన్ డిపాజిట్ చేసి రసీదు పొందాలని తెలిపారు. జూన్ 4 ఉదయం ఎనిమిది గంటలకు ఓట్లు లెక్కింపు పక్రియ ప్రారంభమవుతుందన్నారు. ప్రతి రౌండ్‌కు లెక్కింపు వివరాలను డిస్‌ప్లే బోర్డు నందు ప్రదర్శించడంతోపాటు, ఎన్ కోర్ నందు అప్డేట్ చేస్తామన్నారు. లెక్కింపు పూర్తయిన అనంతరం ఈవీఎంలను తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి సీల్ వేస్తారని తెలిపారు. రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు, ప్రజలు ఓట్లు లెక్కింపు సజావుగా పూర్తి చేయడానికి సహకరించాలని కోరారు.ఏనుమాముల మార్కెట్ యార్డులో ఏర్పాట్ల పరిశీలన అనంతరం ఏనుమాముల మార్కెట్ యార్డులో నిర్వహించనున్న వరంగల్ మెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్ పి ప్రావిణ్య జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పారదర్శకతతో కూడిన ఏర్పాట్ల విషయంలో ఖచ్చితత్వం పాటించే విధానంలో చేపట్టవలసిన వాటిపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు స్ట్రాంగ్ రూమ్ వద్ద నిర్వహించే విధులపై చర్చించారు అనంతరం విజిటర్స్ రిజిస్టర్ లో వారు సంతకం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డిపిఆర్ ఓ ఆయుబ్ అలీ, భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్ కుమార్ రెడ్డి, పర్యవేక్షకులు విశ్వ నారాయణ, చంద్రశేఖర్, ఆర్ అండ్ బి ఏ ఈ శ్రీకాంత్ తదితరులున్నారు.



# అకాల వర్షాలు.. ఐదు రోజుల్లో 11 మంది మృతి

## - పలు జిల్లాలకు సర్కారు హెచ్చరిక

చెన్నై: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 11 మంది మరణించినట్టు ప్రభుత్వం ప్రకటించింది. కన్నియాకుమారి, కోయంబత్తూరు, తిరునెల్వేలి, నీలగిరి జిల్లాలకు భారీ వర్ష హెచ్చరికలను జారీ చేసింది. వర్ష ప్రభావిత జిల్లాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా 296 మందితో కూడిన పది విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచింది. వాతావరణంలో మార్పుల కారణంగా గత కొన్ని రోజులుగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు రాష్ట్రంలోని 37 జిల్లాల్లో వర్షాలు కురవగా, గరిష్టంగా నామక్కల్ జిల్లాలో 7.12 సెంటీమీటర్ల వర్షంపాతం నమోదైనట్టు రెవెన్యూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రకటించింది.

మంగళవారం కూడా తిరుచ్చి, తిరునల్వేలి, కోయంబత్తూరు తదితర జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షం కురిసింది. తిరుచ్చి జిల్లా శ్రీరంగంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలోకి భారీగా వరదనీరు ప్రవేశించింది. కాగా వర్ష హెచ్చరికల నేపథ్యంలో కోస్తా జిల్లాల్లో ముందస్తు హెచ్చరికలు చేపట్టారు. అలాగే, పశ్చిమ కనుమల్లోని కన్నియాకుమారి, తిరునెల్వేలి, తెన్‌కాశి, దిండిగల్, కోయంబత్తూరు, నీలగిరి, విరుదునగర్, తేని, తిరుచ్చి జిల్లాలకు భారీ వర్షసూచనలతో ఈ జిల్లాల వాసులకు ముందస్తు జాగ్రత్తలకు సంబంధించి ఎస్ఎంఎసలు పంపించారు. అలాగే, వర్షబాధిత జిల్లాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా 296 మంది నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బందిని పది బృందాలను సిద్ధం చేసి, కన్నియాకుమారి, కోయంబత్తూరు, తిరునెల్వేలి, నీలగిరి జిల్లాల్లో సిద్ధంగా ఉంచారు.

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రంలో గత ఐదు రోజుల్లో 11 మంది మృతి చెందారు. అలాగే, గత 24 గంటల్లో 12 పశువులు చనిపోగా, 24 గుడిసెలు, ఇళ్లు దెబ్బతిన్నాయి.




రాష్ట్రంలోని కోస్తాతీర ప్రాంతం, కన్నియాకుమారి, గల్ఫ్ ఆఫ్ మన్నార్ ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, అందువల్ల జాలర్లు సముంద్రంలోకి చేపల వేటకు వెళ్లొద్దని, సముద్రంలో చేపల వేటకు వెళ్లిన జాలర్లు ఈ నెల 23వ తేదీలోపు తీరానికి చేరుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

# కొత్తరకం కరోనా వైరస్‌పై ఆందోళన వద్దు...

చెన్నై: సింగపూర్‌లో తాజాగా వ్యాపిస్తున్న కొత్త రకం కరోనా వైరస్ రాష్ట్రంలో ఇదివరకే వ్యాపించిన జేఎన్1 రకం వైరస్ రూపాంతరమేనని, అందువల్ల కొత్త రకం వైరసతో భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్యశాఖ ప్రకటించింది. రాష్ట్రంలో రెండేళ్లుగా కరోనా వ్యాప్తి పూర్తిగా నియంత్రణలోకి వచ్చింది. ప్రస్తుతం చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు, కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్ తదితర జిల్లాలకు చెందిన 14 మంది మాత్రమే కరోనా స్వల్ప లక్షణాలతో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో, సింగపూర్ దేశంలో కొత్త రకం కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా, ఒకే వారంలో 26,000 మందికి ఈ లక్షణాలు నిర్ధారణ అయ్యాయి. దీంతో, ఈ కొత్త రకం వైరసను నియంత్రించేలా ప్రజలందరూ తప్పకుండా మాస్కులు ధరించాలని ఆ దేశ ప్రభుత్వం ఆదేశించింది. తమిళనాడు-సింగపూం మధ్య పారిశ్రామికంగా, వాణిజ్య పరంగా మంచి సంబంధాలుండడంతో వందలాదిమంది తరచూ ప్రయాణిస్తుంటారు.

ఈ కారణంగా రాష్ట్రంలోనూ కొత్త రకం కరోనా వైరస్ ప్రబలే అవకాశముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఆరోగ్యశాఖ డైరెక్టర్ సెల్వవినాయగం మాట్లాడుతూ... సింగపూర్‌లో ప్రస్తుతం వ్యాపిస్తున్న కేపీ.1, కేపీ2 రకానికి చెందిన కరోనా వైరస అని, ఒమైక్రాన్ జేఎన్1 తరహాలోనే ఈ వైరస రూపాంతరం చెందాయని తెలిపారు. రాష్ట్రంలో జేఎన్1 రకం కరోనా వైరస్ లక్షణాలు ఫిబ్రవరిలోనే కనుగొన్నామన్నారు. అందువల్ల ఆ దేశంలో వ్యాపిస్తున్న కొత్త రకం వైరస్ ప్రభావం రాష్ట్రంలో ఉండే అవకాశం లేదన్నారు. కొత్త రకం వైరస్ వ్యాప్తిపై ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. కానీ, ముందస్తు జాగ్రత్తగా తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం, భౌతిక దూరం పాటించడం, ఇతర వ్యాధులున్న వారు, వృద్ధులు మాస్క్ ధరించడం తదితరాలు పాటిస్తే మంచిదని ఆయన తెలిపారు.



# ధాన్యం ప్రాధాన్యత క్రమంలో ఎగుమతి జరిగేలా చూడాలి

## ఇందిరా క్రాంతిపథం అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.




**మెదక్ ప్రతినిధి మే 22 (అక్షరం న్యూస్)**

ఐకెపి కొనుగోలు కేంద్రాలలో దాన్యం నిలువలను ప్రాధాన్యత క్రమంలో ఎగుమతి జరిగేలా చూడాలని ఇందిరా క్రాంతి పదం అధికారులను అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు ఆదేశించారు బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐకెపి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు , ధాన్యం కొనుగోలు ఎగుమతి దిగుమతుల లోటుపాట్లపై డిపిఎం ,ఏపీఎంలు సీసీలతో సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఐకెపి కొనుగోలు కేంద్రాలు జిల్లాలో 108. నిర్వహిస్తున్నట్లు అందులో 25కేంద్రాలుకొనుగోలుపూర్తిచేసుకునిమూసివేయబడినవని రైతులు దగ్గర నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని లారీలు కొరత ఉన్నప్పటికీ లోకల్ సోర్స్ ను ఉపయోగించి రవాణా చేయించాలన్నారు నాణ్యత గల ధాన్యాన్ని రైతుల దగ్గర నుండి తీసుకుని అంతే నాణ్యత గల ధాన్యాన్ని మిల్లులకుపంపినట్లయితేసరసమైన ధర లభ్యమై రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు క్షేత్రస్థాయిలో ఎటువంటి సమస్యలు ఉన్నప్పటికీ తన దృష్టికి తేవాలని వివరించారు కొనుగోలు కేంద్రాల వారీగా నిర్వాహకుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలోజిల్లాగ్రామీణఅభివృద్ధిఅధికారిశ్రీనివాసరావు, డి సి ఎస్ ఓ బ్రహ్మ రావు, డి ఎం సివిల్ సప్లై హరికృష్ణ, డిసిఓ కరుణ, సంబంధిత ఐకెపి కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ఏటీఎంలు సీసీలు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూలు జిల్లాలో కల్తీ విత్తనాల మీద నిఘా

## - జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



**నాగర్ కర్నూల్ , మే 22(అక్షరం న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో రైతులకు కల్తీ విత్తనాలను అమ్మకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిన దానిలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా లో కల్తీ విత్తనాల మీద నిఘా ఉంచడానికి ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశాల మేరకు పదిమందితో టీమును ఏర్పాటు చేయడం జరిగింది , ఈ టీము అగ్రికల్చర్ ఆఫీసర్ తో కలిసి నాగర్ కర్నూలు జిల్లాలో ఉన్న ఫర్టిలైజర్ షాపులలో ఉన్న విత్తనాలను టెస్టు చేసి మంచి క్వాలిటీ ఉన్న విత్తనాలకు రైతులకు అందేలా చేయాలని సూచించారు , ఒకవేళ కల్తీ విత్తనాలు రైతులకు అమ్మినచో వారి పైన చట్టరీత్యా చర్య తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు, ఈ కల్తీ విత్తనాల మీద నిఘా ఉంచడానికి ఏర్పాటు చేసిన టీము సి సి ఎస్ సి ఐ శంకర్ ఆధ్వర్యంలో పనిచేస్తుంది , ఈ టీమ్ లో వంగూర్ ఎస్ ఐ మహేందర్, తాడుర్ ఎస్ ఐ మహేష్, లింగాల ఎస్ ఐ జగన్ మోహన్ తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఎంజీఎంలో విద్యుత్ అంతరాయం

## హాస్పిటల్‌ను సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య

**వరంగల్ జిల్లా మే 22 (అక్షరం న్యూస్)**

వరంగల్ జిల్లా మహాత్మా గాంధీ మెమోరియల్ ఆసుపత్రిలో మంగళవారం సాయంత్రం విద్యుత్ అంతరాయం కావడంపై జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య బుధవారం ఎంజెఎం ఆస్పత్రిలో క్షేత్రస్థాయిలో పర్యటించారు.ఆసుపత్రిలో ఉన్న అన్ని జనరేటర్లు, అనుసంధానంలో ఉన్న వార్డ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ అంతరాయం కు గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.విద్యుత్ అంతరాయం జరిగిన సమయంలో ఎలాంటి వైద్య చికిత్సలను ఆపడం జరగలేదని సూపరింటెండెంట్‌తెలిపారు.మంగళవారం సాయంత్రం 6.15 గంటలకు ఆసుపత్రిలో విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడగా ఎన్పీడీసీఎల్ అధికారులను సంప్రదించగా తక్షణమే వారు స్పందించి విద్యుత్ జంపర్లు సరిచేసి అదే రోజు రాత్రి 8.45 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం జరిగిందని, డయాలసిస్ విభాగానికి తప్ప ఎమర్జెన్సీ వార్డులతో సహా అన్ని వార్డ్ లకు విద్యుత్ సరఫరా చేయడం జరిగిందని,

డయాలసిస్ వార్డులో రిపేర్ లో ఉన్న జనరేటర్ ను మరమ్మత్తులు చేయడం జరిగిందని,సూపరింటెండెంట్ కలెక్టర్కు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం కలగడానికి గల కారణాలపై, ఎంజీఎంలోని అన్ని జనరేటర్లు ఎలక్ట్రికల్ ఎక్విప్మెంట్ లు సక్రమంగా పనిచేసే విధంగా వివరాత్మక నివేదిక అందించాలని ఎన్పీడీసీఎల్ లను కోరడం జరిగిందన్నారు.డయాలసిస్‌విభాగానికి సంబంధించిన జనరేటర్ పనిచేయక పోవడంపై సంజయ్ సమర్పించాల్సిందిగా ఎంజిఎం సూపర్డెంట్ ను ఆదేశించారు.ఆడిట్ రిపోర్ట్ ప్రకారంభవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా క్రమం తప్పకుండా మెంటేనేన్స్ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆన్నారు.ఈ కార్యక్రమంలో ఎంజీఎం ఇన్చార్జ్ సూపర్డెంట్ రామ్ కుమార్ రెడ్డి, ఎంపీడీసీఎల్ ఎస్ ఈ మధుసూదన్ రావు డి ఈ మల్లికార్జున్ ఏ డి ఈ శ్రీనివాస్ రెడ్డి, ఎంజీఎం ఆర్ ఎం ఓ లు సంబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు వేణుగోపాలస్వామి కల్యాణం

జనగామ జిల్లా /రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ ) మే 22 : మండలంలోని గోవర్ధనగిరి వేణుగోపాలస్వామి గుట్టపై గురువారం శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణమహోత్సవం నిర్వహించ నున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిదు లు తెలిపారు. బుధవారం ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లా డుతూ మధ్యాహ్నం 12.30 గంటలకు వేద పండితుల మంత్రోచ్చారణాలతో అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహిస్తా మన్నారు.ఈ కల్యాణ మహోత్సవా నికి పెద్ద సంఖ్యంలో గ్రామస్తులు హాజరు కాగలరని వారు కోరారు.

## విద్యార్ధులకు కరాటే గోల్డ్ మెడల్



కాల్వ శ్రీరాంపూర్, పెద్దపల్లి జిల్లా మే 22 అక్షరం న్యూస్: మండలంలోని వెన్నంపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు గోవాలో ఇటీవల జరిగిన కరాటే పోటీలో గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను వెన్నంపల్లి మాజీ సర్పంచ్ కాసం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందలు తెలియజేసి వారిని శాలువాతో ఘనంగా సత్కరించి అనంతరం విద్యార్థులకు నగదు పారితోషకం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కారకూరి సత్యనారాయణ, కూర్మ మధుకర్, ఎంబాడి తిరుపతి, కంది ఆనంద్, వెల్తురు జనార్ధన్, కారుకూరి శంకరయ్య, అంకతి రాజయ్య, బంటి సదానందం, కందుల నాగరాజు, కాంపెల్లి సతీష్, మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం




కొడకండ్ల,మే22(అక్షరం న్యూస్): పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్ల మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మరియు పాలకుర్తి నియోజక వర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి వేములవాడ కాంటెస్ట్ ఎమ్మెల్యే చల్మెడ లక్ష్మీనరసింహ రావు పాల్గొని మాట్లాడుతూ రానున్న గ్రాడ్యుయేట్ ఎలక్షన్ లో అందరూ గ్రాడ్యుయేట్స్ ఆలోచించి బిఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము అని అన్నారు. అద్భుతమైన వాగ్దాటి పోరాట పటిమ,ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం కలిగిన రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ మీద ఉంది అన్నారు. అదేవిధంగా రేపు తొర్రూర్ కు కొడకండ్ల మండలం నుండి పట్టభద్రులు భారీ సంఖ్యలో తరలి రావాలి అని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో మండల నాయకులు,పట్టణ నాయకులు,యువకులు, పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ సంఘాల మహాకూటమి ఖమ్మం జిల్లా కన్వీనర్‌గా కొమ్ము ప్రసాద్ మాదిగ..



ఖమ్మం /తల్లాడ పాలేరు మే 22 (అక్షరంన్యూస్)

తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం హైదరాబాదులోని హబ్సిగూడ సుప్రభాత హొటల్లో జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాదిగ సంఘాల మహాకూటమి రాష్ట్ర చైర్మన్ పోకల కిరణ్ మాదిగ అధ్యక్షత కార్యక్రమం నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మాదిగ సంఘాలన్నీ మహాకూటమిగా కలుపుకొని ఐక్యతను చాటుతూ జాతికి మేలు చేసే కార్యక్రమంలో భవిష్యత్తులో జాతి మనుగడ కోసం బాధ్యత కలిగిన వ్యక్తులను ఏర్పాటు చేసుకొని రాష్ట్ర ప్రభుత్వంతో జాతి అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్వహించే పథకాలను ముందుకు నడిపించుటకు తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి ముందువరుసలో ఉంటుందని తెలంగాణ రాష్ట్రంలో అతి పెద్ద కులం మాదిగ జాతి మాత్రమేనని జాతి అభివృద్ధి కోసం మహాకూటమి కీలక పాత్ర పోషిస్తుందని తెలంగాణ మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్ మాదిగ మాట్లాడటం జరిగింది. అందులో భాగంగా రాష్ట్ర సమీక్ష సమావేశంలో రాష్ట్ర సలహాదారులుగా అదేవిధంగా వివిధ జిల్లాల సమన్వయకర్తలను నియమించడం జరిగింది. ఖమ్మం జిల్లా సమన్వయకర్తగా నకరికంటి సంజీవరావు మాదిగ, కొమ్ము ప్రసాద్ మాదిగ, రామకృష్ణ మాదిగను నియమించడం జరిగింది. మాపై నమ్మకం ఉంచి మాకు జిల్లా సమన్వయకర్త పదవి ఇచ్చినందుకు ముందుగా రాష్ట్ర చైర్మన్ పోకల కిరణ్ మాదిగ గారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ మా పై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆ పదవికి న్యాయం చేస్తామని కొమ్ము ప్రసాద్ మాట్లాడడం జరిగింది . కార్యక్రమంలో పొట్ట పెంజర కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# సమస్త ప్రజానీకాన్ని మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్

### మాజీ మంత్రి కేటీఆర్



వరంగల్ జిల్లా/నర్సంపేట డివిజన్/మే 22 అక్షరం న్యూస్/

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా నర్సంపేట పట్టణంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పట్టభద్రుల సమావేశానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు. కేటీఆర్ హాజరుకావడం జరిగింది.బిఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...– రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని వినూత్న కార్యక్రమాలు చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన పెద్ది సుదర్శన్ రెడ్డి ఓడిపోవడం దురదృష్టం.– కిందటి ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో మీటింగులు పెట్టి ప్రజలు మోసపోవద్దని చెప్పాము, కానీ కాంగ్రెస్ చెప్పిన మోసపూరితమైన హామీలను నమ్మి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారు.– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో భాగంగా డిసెంబర్ 9న రైతులకు 2 లక్షల రుణమాఫీ చేస్తానని రైతులకు హామీ ఇచ్చాడు.

– ఇప్పటికే ఆరు నెలలు గడుస్తున్నా ముఖ్యమంత్రి అయిన మొదటి రోజె రుణమాఫీ మీద సంతకం పెడతా అని మోసం చేసిన రేవంత్ రెడ్డిని ఏం చేయాలో ప్రజలు ఆలోచించండి.– బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు 10వేల రైతుబంధు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే 15 వేల రూపాయల రైతు భరోసా ఇస్తానని ప్రకటించారు.

– నేటికి ఆరు నెలలైనా ఇంతవరకు ఏ గ్యారెంటీని అమలు చేయని నిస్సహాయక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.– బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు నాట్లు వేసే ముందే రైతుబంధు పడేది కానీ కాంగ్రెస్ హయాంలో ఓట్లు వేసే ముందు మాత్రమే రైతుబంధు పడుతుంది, ఇదేనా కాంగ్రెస్ తెచ్చిన మార్పు.

– రైతులను, ఉద్యోగులను గ్రాడ్యుయేట్లను, సమస్త ప్రజానీకాన్ని హామీలతో మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్.

– రేవంత్ రెడ్డి ఎలక్షన్లో హామీలలో భాగంగా వరి ధాన్యానికి క్వింటాలకు 500 రూపాయలు బోనస్ ఇస్తానని గెలిచి ఇప్పుడు సన్న బియ్యం పండించిన రైతులకు మాత్రమే క్వింటాలకు 500 బోనస్ ఇస్తానని చెప్తున్నాడు..– కెసిఆర్ ప్రభుత్వంలో 2 లక్షల గవర్నమెంట్ ఉద్యోగాలు ఇచ్చింది. కానీ ఇచ్చిన ఉద్యోగాలను ప్రచారం చేసుకోవడంలో విఫలమయ్యాం.

– పదేళ్ల కాలంలో అధికంగా గవర్నమెంట్ ఉద్యోగులను తీసుకు వచ్చింది, భారతదేశంలో కేవలం తెలంగాణల బిఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే.– చేసిన అభివృద్ధిని చెప్పుకోవడంలో మేము ఫెయిల్ అయ్యాము.

– కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6గ్యారెంటులో ఏ ఒక్క గ్యారెంటీ కూడా అమలు చేయలేక ప్రజలను మోసం చేస్తుంది.– నోటిఫికేషన్ ఇవ్వకుండా ఇంటర్వ్యూ పెట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం 30 వేల ఉద్యోగాలు ఇచ్చాము అని చెప్పుకొని తిరుగుతుంది.ఏ

– గ్రాడ్యుయేట్ ఓటర్ మహాశయులారా ఆలోచించి... మీ అమూల్యమైన ఓటుని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి లి"ఏనుగుల రాకేష్ రెడ్డి"కి వేసి గెలిపించగలరు.

– బిట్స్ పిలానీలో డిగ్రీ పట్టా పొంది గోల్డ్ మెడల్ సాధించి, అమెరికాలో 7 సంవత్సరాలు ఉద్యోగం చేసిన ఉన్నత విద్యావంతుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి ని గెలిపిద్దామా?, లేక బ్లాక్ మెయిలర్, 50 క్రిమినల్ కేస్లున్న మల్లన్నని గెలిపిద్దామా? గ్రాడ్యుయేట్ ఓటర్ లారా మీరే ఆలోచించాలి.– శాసనమండలిలో ఉద్యోగుల సమస్యలను, ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే దమ్మున్న రాకేష్ రెడ్డి లాంటి నాయకుడు ఉండాలి.– గ్రాడ్యుయేట్ ఓటుతో ప్రశ్నించే గలమున్న ఏనుగుల రాకేష్ రెడ్డి లాంటి ఉన్నత విద్యావంతుని శాసనమండలికి పంపాలంటే మీ అమూల్యమైన గ్రాడ్యుయేట్ ఓటును రాకేష్ రెడ్డికి వేసి గెలిపించగలరని ఈ సభాముఖంగా తెలియజేసుకుంటున్నాను.







## పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ఏకరూప దుస్తులు అందించాలి.. జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్

ఖమ్మం/ తల్లాడ మే 22 (అక్షరంన్యూస్)

పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ఏకరూప దుస్తులు అందించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం, జలగం నగర్ లోని మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని సందర్శించి, ఏకరూప దుస్తుల తయారీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏకరూప దుస్తుల అందజేతకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 248837 మంది విద్యార్థులు ఉండగా, ఇందులో 115990 మంది బాలురు, 132857 మంది బాలికలు ఉన్నట్లు ఆయన అన్నారు. 1185 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులను గుర్తించి, ఏకరూప దుస్తుల తయారీకి చర్యలు చేపట్టినట్లు ఆయన అన్నారు. విద్యార్థుల వారిగా కొలతలు తీసుకొని, మహిళా శక్తి కుట్టు కేంద్రాలకు తయారీకి అప్పజెప్పినట్లు ఆయన అన్నారు. జలగం నగర్ మహిళా కుట్టు కేంద్రం లో 19 కుట్టు మిషన్లు ఉండగా, కటింగ్ మిషన్, కాజా మిషన్, బటన్ మిషన్ లు సమకూర్చినట్లు ఆయన అన్నారు. మిషన్ల ఆపరేటింగ్ నేర్చుకొని, మరికొందరికి నేర్పాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ఏకరూప దుస్తులు అందడంతో పాటు, స్వయం సహాయక సంఘాల వారికి ఉపాధికల్పన జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సందర్శన సందర్భంగా కలెక్టర్ స్వయం సహాయక సంఘ సభ్యులతో మాట్లాడారు. సంఘ సభ్యులు మహిళలు ఆర్థికంగా నిలద్రొక్కుకొనే విధంగా ప్రభుత్వం ఆసరా ఇస్తున్నదని అన్నారు. మహిళా సంఘాలకు ఏకరూప దుస్తుల ఆర్డర్ ఇవ్వడమే కాక, కటింగ్, కాజా, బటన్ మిషన్ల కొనుగోలుకు ప్రభుత్వం తోడ్పాటు ఇచ్చిందని, ఇది ఎంతో సంతోషకరమని అన్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో ఆర్థికంగా ఎదిగి, సమాజంలో గౌరవంగా జీవనం సాగిస్తామని తెలిపారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా ఖమ్మం రూరల్ మండలం ఎంపిడివో ఎస్. కుమార్, ఏపీఎం ఎం. శ్రీనివాసరావు, సిసి బి. మోహన్ రావు, కె. శారద, అధికారులు తదితరులు ఉన్నారు.

## ఎన్నికల విధులు, బాధ్యతలపై సెక్టార్ అధికారులు పూర్తి అవగాహన కలిగివుండాలని తెలిపిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్




ఖమ్మం/ తల్లాడ మే 22 (అక్షరంన్యూస్)

ఎన్నికల విధులు, బాధ్యతలపై సెక్టార్ అధికారులు పూర్తి అవగాహన కలిగివుండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. బుధవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా నియమించబడ్డ సెక్టార్ అధికారులకు ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా నిర్వహించబడతాయని, ఎక్కడా చిన్న పొరపాట్లు లేకుండా, జీరో ఎర్రర్ తో ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, తక్కువ ఓటర్లు కదా అనే భావన రావద్దని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ తో జరుగుతాయని ఆయన అన్నారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల సందర్శన చేసి, కనీస మౌళిక సదుపాయాల కల్పన పరిశీలించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటుచేస్తారని ఆయన తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ సామాగ్రిని పోలింగ్ సిబ్బందితో పాటు తీసుకొని, పోలీస్ ఎస్కార్ట్ తో వారి వారి పోలింగ్ కేంద్రాలకు చేర్చాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగించుకొని తిరిగి వారిని రిసిప్షన్ కేంద్రానికి తీసుకువచ్చే బాధ్యత సెక్టార్ అధికారులదేనని ఆయన అన్నారు. ఎన్నికల నిర్వహణ లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని ఆయన అన్నారు.

కార్యక్రమంలో జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు, జిల్లా ఉపాధికల్పన అధికారి కె. శ్రీరామ్ సెక్టార్ అధికారుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని తెలిపిన జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్



ఖమ్మం/ తల్లాడ మే 22 (అక్షరంన్యూస్)

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో

వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. బుధవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో ఆర్డీవోలు, తహశీల్దార్లతో ధరణీ దరఖాస్తుల పరిష్కారం పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధరణి పెండింగ్ దరఖాస్తులను నెలాఖరు లోగా పరిష్కరించాలన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలన్నారు. ప్రతిరోజు తహసీల్దార్ కనీసం 25 ఫైళ్లు సమర్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ లలో పెండింగ్ స్లాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, ఖమ్మం, కల్లూరు ఆర్డిఓ లు జి. గణేష్, ఎల్. రాజేంద్ర గౌడ్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ప్రభుత్వం కన్నా మెరుగ్గా కొనుగోళ్లు



- ఆనాడు వరికుప్పలపైనే రైతులు ప్రాణాలు వదిలారు
- ఇప్పుడు ధైర్యంగా పంటలు అమ్ముకుంటున్నారు
- సన్న ధాన్యం ప్రోత్సాహం కోసమే 500 బోనస్
- ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు లేకుండా రైతులకు మద్దతు
- బిఆర్ఎస్ అబద్దాలు ప్రచారం మానాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

హైదరాబాద్,మే22((అక్షరం న్యూస్:

బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం, ధాన్యం సేకరణ వేయి పాళ్లునయమని, ఇది తెలంగాణ రైతుల అభిప్రాయం అనివ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలియజేసారు. గతంతో పోలిస్తే ముందస్తుగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసామని, చురుకుగా కొనుగోళ్లు సాగుతున్నాయని అన్నారు. తెలంగాణలో సన్న వడ్ల సాగును పెంచేందుకు 500 బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణలో దొడ్డు వడ్లు తినడం చాలా తగ్గిపోయింది. గత ప్రభుత్వంలో సన్న బియ్యం పేరుతోటి దొడ్డు వడ్లనే పాలిష్ చేసి అంగన్వాడీలకు, మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించేవారు. అలా కాకుండా పేదలు కూడా పెద్దోళ్లు తినే సన్న బియ్యం తినాలనే సంకల్పంతో రేషన్ దుకాణాల్లో కూడా సన్న బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని పెట్టుకుంది. కానీ ఇతర రాష్ట్రాల నుంచి సన్నబియాన్ని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇకపోతే ఐకేపీ సెంటర్ల పెంపు గత ఏడాదితో పోలిస్తే నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేసామని, ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు జిల్లాకొక ఐఏఎస్ ను నియమించి ఎప్పటికప్పుడు సమీక్ష చేయిస్తున్నామన్నారు. తరుగు, తాలు పేరుతో కోతలు లేవు.. గతంలో ప్రతి క్వింటాకు 7 నుంచి 10 కేజీల వరకు తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ.. ఈ దఫా మిల్లర్ల దోపిడీ పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో కోతలకు మిల్లర్ల స్వస్తి చెప్పారని అన్నారు. దీంతో ప్రతి కింటా పై రైతుకు 150 నుంచి 200 రూపాయల వరకు అదనపు లబ్ది చేకూర్చామన్నారు. రైతులు పంట అమ్ముకున్న ఐదు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతోందని, గతంలో 45 రోజులు పెట్టేదన్నారు. రైతు ఎంతో వడ్డీ నష్ట పోయేవాడు. కానీ ఇప్పుడు కేవలం 5 రోజుల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమ అవుతుంది దీంతో రైతుకు వడ్డీ వ్యాపారుల వేధింపులు లేవు. వడ్డీలు కట్టాల్సిన అవసరం లేదు. ఆత్మగౌరవంతో ఇప్పుడు రైతు బతుకుతున్నాడని, కేసీఆర్ ప్రభుత్వంలో ఫసల్ బీమా యోజన లేదు. ఉంటే కనీసం పంట నష్టపరిహారం వచ్చేదన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్, రైతు ప్రభుత్వం కాబట్టి పంట నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ అందిస్తోందన్నారు. అంతే గాక, ఇక ముందు ఏ ఒక్క రైతు కూడా ఇలా నష్టపోకుండా, ప్రభుత్వమే రైతుల ప్రీమియం చెల్లించి పంట భీమా పథకాన్ని 3,000 కోట్ల రూపాయలు వెచ్చించి వానాకాలం నుండి అమలు చేస్తున్నామన్నారు. అలాగే తడిచిన ధాన్యాన్ని సైతం ఈ ప్రభుత్వం సేకరిస్తుంది. గతంలో కల్లాల్లో వరికుప్పలమీద రైతులు గుండె పగిలి చనిపోయారు. కానీ మాది రైతు ప్రభుత్వం అని తెలిసి రైతులు గుండె ధైర్యంతో బతుకుతున్నారు. అందుకే మనం దొడ్డు వడ్లు అమ్ముకొనుడెంది, సన్న వడ్లు కొనుక్కునుడేంది.. మనమే మనకు అవసరమైనంత సన్న వడ్లను ఉత్పత్తి చేసుకునేందుకు ఈ బోనస్ పథకాన్ని ప్రవేశపెట్టాము. నాట్లేసుకునే సమయం దగ్గర పడుతుంది కాబట్టి యుద్ధ ప్రాతిపదికన ఈ స్కీమును ప్రవేశపెట్టాం. భవిష్యత్తులో దొడ్డు వడ్లకు కూడా ఈ స్కీములు వర్తింప చేస్తాము. దొడ్డు వడ్లకు 500 రూపాయలు ఇప్పుడు ఇవ్వలేకపోయినా?మూడు నుంచి ఐదు రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తూ, మిల్లర్ల ధాన్యం కోతను అరికడుతూ.. ప్రత్యక్షంగా అంతమేరా రైతుకు ఈ ప్రభుత్వం లబ్ది చేకూరుస్తోంది. అది తెలుసు కనుకనే తెలంగాణ రైతులు నిశ్చింతగా ఉన్నారు. రైతులను కాల్చుకుతిన్న టిఆర్ఎస్ అగ్ర నాయకులు ఇప్పుడు రైతుల పేర నాటకాలు ఆడుతున్నారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తామని 2020లో కెసిఆర్ ప్రకటించారు. ఆ తర్వాత మూడేళ్లు అధికారంలో ఉన్న నయా పైసా బోనస్ ఇయ్యలేదు అందుకే కేసిఆర్ ను ఓడగొట్టి రైతులు ఇంట్లో కూర్చోబెట్టారు. అన్నదాతలార ఆలోచించండి..ఇది ప్రజా ప్రభుత్వం. ఎక్కడ దుబార చేయకుండా.. కెసిఆర్ అస్తవ్యస్థం చేసిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. త్వరలో అన్ని హామీలను నిలబెట్టుకుంటాం. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీల అమలు ప్రక్రియను ప్రారంభిస్తామని చెప్పాము. ప్రారంభించి చూపించాం. వచ్చే ఎన్నికల నాటికి అన్ని హామీలను పూర్తి చేసి తీరుతాం. లేకుంటే ఓట్లే అడగం, ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు తమ తప్పుడు ప్రకటనలు ఆపుకోవాలని తుమ్మల నాగేశ్వర రావు హితవు పలికారు.

# మరోమారు అధికారం ఎన్డిఏదే

- భారత్ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుదల
- బీజేపీ 305 సీట్లు గెలుచుకుంటుంది
- అమెరికన్ పొలిటికల్ సైంటిస్ట్ అంచనా

న్యూఢిల్లీ,మే22 అక్షరం న్యూస్:

లోక్‌సభ ఎన్నికలు తుది దశకు వచ్చాయి. మరో రెండు విడతల్లో దేశంలోని 543 ఎంపీ స్థానాలకు ఎన్నికలు ముగియనున్నాయి. అయితే, ఈ సారి ఎన్నికల్లో మొత్తం అంకెల చుట్టూ తిరుగుతోంది. బీజేపీ స్వయంగా 370 సీట్లు, ఎన్డీయే కూటమి మొత్తంగా 400 కన్నా ఎక్కువ స్థానాలు గెలుస్తుందని బీజేపీ నేతలు చెబుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈసారి బీజేపీ కేవలం 200 కన్నా తక్కువ స్థానాలకే పరిమితమవుతుంది, ఇండియా కూటమి 300 స్థానాలను కన్నా ఎక్కువ గెలుచుకుని అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తోంది. వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కూడా బిజెపి 300కు పైగా సీట్లను గెల్చుకుంటుందని విశ్లేషణ చేశారు. ఈ క్రమంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 305 గెలుచుకుంటుందని అమెరికన్ పొలిటికల్ సైంటిస్ట్, గ్లోబల్ పొలిటికల్ రిస్క్ కన్స్టలెంట్ ఇయామ్ బ్రెమ్మర్ మంగళవారం జాతీయ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రపంచ రాజకీయ దృక్కోణం లో భారత సార్వత్రిక ఎన్నికలు స్థిరంగా కనిపించే ఏకైక విషయమని, మిగతావన్నీ అమెరికా ఎన్నికలతో సహా సమస్యాత్మకంగా కనిపిస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం భౌగోళిక రాజకీయాలు నిశ్చితిలో ఉన్నాయని అన్నారు. ప్రపంచీకరణ కంపెనీలు కోరుకున్న విధంగా జరగడం లేదని చెప్పారు. రాజకీయాలు ప్రపంచ మార్కెట్లోకి ప్రవేశించడం..యుద్ధాలు, యూఎస్-చైనా సంబంధాలు, అమెరికా ఎన్నికలు అన్ని ఇందులో భాగమే అని అన్నారు. ఈ ఒత్తిళ్లు మరింత ప్రతీకూలంగా ఉన్నాయని, వాస్తవానికి రాజకీయంగా స్థిరంగా కనిపించే ఏకైక విషయం భారతదేశ ఎన్నికలే అని, మిగతావన్నీ సమస్యాత్మకంగా ఉన్నాయని చెప్పారు. ఏడు దశల్లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 295-315 సీట్లు గెలుస్తుందని అంచనా వేశారు. ఇదిలా ఉంటే ప్రముఖ ఎన్నికల వ్యూహాకర్త ప్రశాంత్ కిషోర్ కూడా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి మరోసారి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. 2019లో సాధించిన సీట్లకు అటూ ఇటూగా లేదా, దాని కన్నా కొన్ని స్థానాలు ఎక్కువగా బీజేపీ గెలుచుకుంటుందని, ఆ పార్టీ చెప్పినట్లు 370 సీట్లు సాధించలేదని

చెప్పారు. ప్రపంచంలోని పలు దేశాల్లో ఎన్నికలు ఉన్నాయని, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ సున్నితమైన ఎన్నికల ప్రక్రియను కలిగి ఉందని బ్రెమ్మర్ ప్రశంసించారు. బలమైన ఆర్థిక పనితీరు, స్థిరమైన సంస్కరణలతో మోడీ మూడోసారి గెలువబోతున్నారని అన్నారు. దశాబ్దాలుగా భారత్ పనితీరును పలు దేశాలు తక్కువగా చూసినప్పటికీ, ప్రస్తుత అమెరికన్ సీఈఓలు భారత్ వస్తున్నారని, తాము వృద్ధిని చూస్తున్నామని, భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడాన్ని చూశామని, బహుశా 2028 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించొచ్చని ఆయన అన్నారు. మిగిలిన దేశాలతో తన స్నేహాన్ని నిర్వహిచే విషయంలో భారత్ శక్తివంతంగా మారడాన్ని ప్రపంచం చూస్తోందని చెప్పారు.

# ద్వారకా తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## మోహినీ అలంకారంలో స్వామి దర్శనం

ఏలూరు,మే22అక్షరం న్యూస్:

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల చిన్న వెంకన్న ఆలయంలో వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు బుధవారం చిన వెంకన్న స్వామి మోహిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అధికారులు స్వామివారిని సింహ వాహనం పై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. రాత్రి 8 గంటలకు స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం జరగనుంది. అనంతరం వెండి గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.కాగా ఉత్సవాలలో భాగంగా నాల్గవ రోజు మంగళవారం స్వామివారు రామ లక్ష్మణ సమేత హనుమాన్ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే హనుమద్వాహనంపై స్వామివారిని ఊరేగించారు. స్వామివారిని దర్శించుకునేందుకు రోడ్లపైకి తరలి వచ్చారు. కాగా రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం జరిగింది. అనంతరం వెండి శేష వాహనంపై స్వామివారిని అధికారులు ఊరేగించారు.

# ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి కెటిఆర్ సాయం



వరంగల్,మే22అక్షరం న్యూస్:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆక్సిడెంట్‌కు గురైన వ్యక్తిని తన ఎస్కార్ట్ కారులో హాస్పిటల్‌కు తరలించారు. వరంగల్ లేబర్ కాలనీ వద్ద

అంజయ్య (55) అనే వ్యక్తి ఆక్సిడెంట్‌కు గురై రోడ్డుపై కిందపడి ఉన్నాడు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచార నిమిత్తం అటుగా నర్సంపేటకు వెళ్తున్న కేటీఆర్ అతన్ని చూసి వెంటనే కారు దిగారు. తన కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ కారులో అత్యవసర చికిత్స కోసం వరంగల్ ఎంజిఎం హాస్పిటల్‌కు తరలించారు. సకాలంలో స్పందించి బాధితుడికి అండగా నిలిచిన కేటీఆర్‌ను పలువురు ప్రశంసించారు.

# మళ్లీ కరెంట్ కోతలు..ఇన్వర్టర్ల మోతలు

- విద్యుత్ సబ్ స్టేషన్ల ముట్టడి..ట్రాన్స్‌ఫార్మర్ల పేలుళ్లు
- ఆరు నెలల్లోనే ఆరుదశాబ్దాలు దౌర్భాగ్యం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ట్వీట్

హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:

గత ఆరు దశాబ్దాల కన్నీటి దృశ్యాలు.. 6 నెలల కాంగ్రెస్ పాలనలోనే ఆవిష్కృతమయ్యాయని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్(ట్విటర్) వేదికగా విమర్శించారు. పదేళ్ల లేని కరెంట్ కోతలను మళ్లీ చూస్తున్నామన్నారు. విద్యుత్తు సబ్ స్టేషన్ల ముట్టడి చూస్తున్నట్లు తెలిపారు. మోటార్లు కాలుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతున్నాయని ఎద్దేవా చేశారు. మళ్లీ చాన్నాళ్లకు ఇన్వర్టర్లు, జనరేటర్ల మోతలు చూస్తున్నట్లు చెప్పారు. సాగునీరు పంట పొలాలు ఎండుతున్నాయన్నారు. ట్రాక్టర్లు ఉండాల్సిన పొలంలో ట్యాంకర్లు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. చుక్కనీరు లేక బోసిపోయిన చెరువులు దర్శనమిస్తున్నాయి. పాత అప్పు కట్టాలని రైతులకు నోటీసులు వస్తున్నాయి. రైతుబంధు కోసం నెలలపాటు పడిగాపులు కాయాల్సి వస్తోంది. తడిసిన ధాన్యాన్ని కొనే దిక్కు లేదు. పదేళ్ల తరువాత అన్నదాతల ఆత్మహత్యలు చూస్తున్నాం. విత్తనాల కోసం రైతుల మొక్కులు.. క్యూలైన్ లో పాసుబుక్కులు చూస్తున్నాం. కాంగ్రెస్ పాలనలో ఇలాంటి విషాద దృశ్యాలు ఇంకెన్ని చూడాలో. ఎంజీఎం ఆసుపత్రిలో 5 గంటల విద్యుత్ కోత బాధాకరం. ఆసుపత్రులను కూడా ఈ ప్రభుత్వం నిర్వహించలేకపోతోంది. కరెంటు కోతలు లేవని సీఎం, మంత్రులు పదేపదే అంటున్నారు. ఆసుపత్రుల్లో కరెంట్ కోతలకు ఎవరు బాధ్యత వహిస్తారని కేటీఆర్ ప్రశ్నించారు.

# అమెరికా జార్జియాలో చెట్టును ఢీకొన్న కారు

ప్రమాదంలో ముగ్గరు భారతీయ విద్యార్థుల మృతి

న్యూఢిల్లీ,మే22(అక్షరం న్యూస్: :అమెరికాలో జార్జియా రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భారత సంతతి విద్యార్థులు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈనెల 14న ఈ ఘటన చోటు చేసుకోగా..అల్ఫారెట్టా పోలీసులు తాజాగా వివరాలు వెల్లడించారు. జార్జియా విశ్వవిద్యాలయంలో చదువుతున్న ఆర్యన్ జోషి, శ్రీయా, అన్వీ శర్మ, రిత్విక్ సోమేపల్లి, మహ్మద్ లియాకత్ అనే ఐదుగురు భారత సంతతి విద్యార్థులు కారులో ఓ కార్యక్రమానికి వెళ్తున్నారు. ఈ క్రమంలోనే జార్జియాలోని అల్ఫారెట్టా సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో ఆర్యన్ జోషి, శ్రియలు అక్కడికక్కడే మరణించగా..అన్వీ శర్మ పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందారు.

# చేసిన పనులు చెప్పుకోలేక ఓడాం

## కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ప్రజలు బాధపడుతున్నారు

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్

నర్సంపేట,మే22అక్షరం న్యూస్:

మా ప్రభుత్వ హయాంలో చేసిన మంచి పనులు చెప్పుకోలేక.. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి కూడా యువతకు దూరమయ్యాం. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పెంచి కూడా వారికి దూరమయ్యాం. ఇలా చేసింది చెప్పుకోలేక ఓడిపోయామన్నారు. నర్సంపేటలో ఏర్పాటు చేసిన వరంగల్-నల్లగొండ --ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచార సభలో కేటీఆర్ పాల్గొని పార్టీ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా ప్రసంగించారు. ఈ ఎన్నికలతో ఫలితంలో ప్రభుత్వం కూలిపోయేది లేదు. తారుమార అయ్యేది లేదు. 6 నెలల క్రితం అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. కేసీఆర్‌తో సహా అందరం ప్రతి నియోజవర్గంలో పర్యటించాం. దయచేసి మోసపోకండి.. గోసపడుతామని చెప్పాము. కానీ ప్రజలు కాంగ్రెస్ వాగ్దానాలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు. ఇప్పుడు బాధపడుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.



చదువుకున్న విద్యావంతులు కాంగ్రెస్ పాలన గురించి ఆలోచించాలని కోరుతున్నాను. ప్రస్తుతం వ్యవసాయం పరిస్థితి ఏంటో ఆలోచించండి. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అందమైన నినాదాలు ఎక్కడున్నాయో ఆలోచించండి. నాకు ఓటు వేస్తే 2 లక్షల రుణమాఫీ దస్త్రంపై డిసెంబర్ 9న తొలి సంతకం చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడు. అర్జంట్‌గా బ్యాంక్‌కు వెళ్లి 2 లక్షల రుణం తెచ్చుకోవాలని కూడా సూచించారు. డిసెంబర్ 9 పోయింది.. మరో పది రోజులు అయితే జూన్ 9 వస్తది. ఆరు నెలలు గడిచిపోతది. తొలిరోజే సంతకం చేస్తానని మోసం చేసిన రేవంత్ రెడ్డి నిలబెట్టిన అభ్యర్థి పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో ఆలోచించాలని గ్రాడ్యుయేట్లను కేటీఆర్ కోరారు. రైతు భరోసా 15 వేలు ఇస్తా.. భూయజమాలకు కాదు కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తానని రేవంత్ నమ్మబలికాడు. రైతు కూలీలకు ఏడాదికి 12 వేలు ఇస్తానని అన్నాడు. కౌలు రైతులకు రైతు భరోసా రాలేదు. తొలిసారి మోసపోతే మోసం చేసినోడిది తప్పు. రెండోసారి కూడా వాడి చేతిలో మోసపోతే మనది తప్పు అయితదని కేటీఆర్ అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే టెట్ పరీక్ష ఫీజు రూ. 20 వేలు చేస్తరని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మీ ఓటుతో ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఒక గళాన్ని మండలికి పంపించాలని కేటీఆర్ కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తా అన్నాడు. 50 వేలతో మెగా డీఎస్సీ అన్నాడు. ఈ రెండు అమలు కాలేదు. కానీ 30 వేల ఉద్యోగాలు ఇచ్చాను అంటున్నారు. అవి కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలు. లీగల్ సమస్యల వల్ల ఆగిపోయాయి. కేవలం కాగితాలు ఇచ్చి తాను ఇచ్చానని ఊదరగొడుతున్నారు. విచక్షణ కలిగిన విద్యావంతులు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. సమాజానికి దిక్సూచిగా ఉంటూ, దిశానిర్దేశం చేసేది మీరే.. మీరు కూడా మళ్లీ మోసపోతారా..? లేదా మేల్కొని ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారికి అవకాశం ఇస్తారా..? ఆలోచించుకోవాలి.

బీఆర్ఎస్ తరపున రాకేశ్ రెడ్డికి కేసీఆర్ అవకాశం ఇచ్చారు. రాకేశ్ రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో పుట్టారని అన్నారు. తెల్లారి లేస్తే బూతులు తిట్టుడు, వెకిలి పనులు చేసుడు కాంగ్రెస్ అభ్యర్థి లక్షణం. దందాలు చేయడం, బెదిరించడం వంటి కేసులు నమోదైనట్లు కాంగ్రెస్ అభ్యర్థి అఫిడవిట్‌లో ఉన్నాయి. తీన్మార్ మల్లన్న అఫిడవిట్‌లో 56 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆడపిల్లల ఫొటోలు మార్ఫింగ్ చేసిన కేసులు, అనుమతి లేకుండా అమ్మాయిల ఫోన్ నంబర్లను ఫేస్‌బుక్‌లో పెట్టిన కేసులు, బ్లాక్ మెయిల్ చేసిన కేసులు.. ఇలా 56 క్రిమినల్ కేసులు ఉన్న మహానుభావుడికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చింది. కాబట్టి అభ్యర్థుల గుణగణాలు చూడాలి. మండలిలో వైట్ కాలర్ వర్కర్ ఉండాల్నా.. బ్లాక్ మెయిలర్ ఉండాల్నా ఆలోచించండి. బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే నర్సంపేట యువత తరపున రేపు మండలిలో గల్లా పట్టి అడిగే పరిస్థితి మాత్రం ఉంటదని అన్నారు. నిరుద్యోగ భృతి ఎక్కడా అని ప్రభుత్వాన్ని నిలదీసే వాయిస్ ఉంటది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరు రైతు బిడ్డలుగా, విద్యావంతులుగా మోసాన్ని గ్రహించి ఓటేయకపోతే నష్టపోయేది మీరే. నోటిఫికేషన్లు ఇవ్వకపోపోయిన పట్టభద్రులు ఓటేశారు అని ప్రభుత్వం అనుకుంటది. జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి ఇవ్వకపోయినా మాకు ఓటేశారు అనుకుంటారు. ఒక్క పరీక్షకు కూడా ఫీజు ఉండదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు టెట్ ఫీజు రూ. 400 ఉండే. ఇప్పుడు రూ. 2 వేలు అయింది. మళ్లీ వాళ్లకు ఓటేస్తే టెట్ ఫీజు రూ. 20 వేలు చేయరా..? ఆలోచించండి. పదేండ్లలో తెలంగాణలో ఎంతో ప్రగతి సాధించాం. కొత్త జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, తండాలు గ్రామపంచాయతీలు అయ్యాయి. ఐటీ ఎగుమతులు పెరిగాయి. పరిశ్రమలు వచ్చాయని కేటీఆర్ తెలిపారు.

# సమిష్టి కృషితో ముందుకు సాగాలి

హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:

కొత్తగా కొన్ని రాష్ట్రాల్లోనూ..కేంద్రంలోనూ కొత్త ప్రభుత్వాలు ఏర్పడబోతున్న తరుణంలో దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలి. కొత్తగా ఏర్పడే కేంద్ర ప్రభుత్వం మూసపద్ధతిలో కాకుండా దేశం పురోగమించే దిశగా ప్రణాళికలతో ముందుకు సాగాలి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అధికా జనాభా, జీఎస్టీ వంటి సమస్యలను ప్రధానంగా తలకెత్తుకోవాలి. ఇందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి. కొత్త ప్రధాని రాష్ట్రాల సిఎంలను విశ్వాసంలోకి తీసుకుని ముందుకు సాగాలి. కలిసి పని చేయాలన్న సంకల్పాన్ని ప్రకటించాలి. తమ పార్టీ అధికారంలో లేదన్న కారణాలతో రాష్ట్రాలను చిన్నతనం చేయరాదు. ఇలా చేయడం అన్నది ప్రజలను అవమానించడమే అవుతుంది. అలాగే దేశంలోను, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న జాతీయ,ప్రాంతీయ పార్టీలు ఆర్థిక క్రమశిక్షణతో పాటు,రాజకీయ క్రమశిక్షణ పాటించా ల్సిన అవసరం ఉంది. దేశాన్ని రాష్ట్రాలను ఆర్థికంగా బలోపేతం చేయడం మరచి ప్రజలకు ఉన్న డబ్బులకు తోడు లక్షల కోట్లలో అప్పులు చేసి పందేరం చేయడం, ఖాతాల్లో నగదు బదిలీ చేయడం ఆగిపోవాలి. రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు.. ఈ రెంటిని అనుసంధానిస్తూ ముందుకు సాగాలి. రాజకీయాల్లో ఏ పార్టీ అయినా హుందాగా ఉండాలి. రాజకీయాల్లో వ్యక్తిగత విద్వేషాలకు తావు ఉండరాదు. గుదిబండగా మారిన పథకాలను ఎప్పటికైనా సమీక్షించి అందుకు తగు నిర్ణయం తీసుకోవాలి. నితరంత రాయంగా డబ్బుల పందేరం లేదా పథకాలో డబ్బులు పంచడంతో ఓట్లు పొందాలన్న ఎత్తుగడలను ఇక ఎంతమాత్రం కొనసాగించరాదు. ఈ డబ్బుల పందేరాన్ని అభివృద్ధిగా చూపి ప్రచారం చేసుకోవడం కూడా సరికాదు. అలగే కులగణన అన్నది కులాల కుంపట్లు రగిలించడం ఖాయం. కులాల ఆధారంగా కాకుండా ఆర్థిక పరిస్థితుల ఆధారంగా గణన జరగాలి. కులరహిత సమాజాం కోసం పాటుపడాల్సిన పాలకులు, రాజకీయ నేతలు కులాల కుంపట్లను ఇంకా ప్రోత్సహిస్తున్నారు. రాజకీయాలు మొత్తం కులాల చుట్టే తిరుగుతున్నాయి. ఇందుకోసం కులాల వారీగా పథకాలు ప్రకటిస్తున్నాయి. అయితే నగదు బదిలీలు, లేదా ఇతర తాయిలాలు ప్రకటించడం దారుణం కాక మరోటి కాదు. రాజకీయ పార్టీలన్నీ ఈ సార్వత్రిక బిసిల ఎజెండా అంటూ వల్లె వేసాయి. ఏ కులం అయినా జాబితాలో మరచిపోయామా అని దివిటీ పెట్టి వెతుకుతున్నాయి. జగన్ కూడా సంక్షేమం, అభివృద్దిని జోడించి డబ్బులను నేరుగా ఖాతాల్లో జమ చేయడమే అన్న విశ్లేషన ఇచ్చారు. అదే పనిగా పందేరం పథకాలకు పెద్దపీట వేస్తూ వచ్చారు. డబ్బులు పంచడమే అభివృద్ధి అన్న నినాదం ఎత్తుకున్నారు. ఇది ఎంతమాత్రం సరికాదు. ఈ విషయంలో ఇకనైనా తీరు మారాలి. ఎపిలోఎవరు అధికారం చేపట్టినా ఈ డబ్బుల పందేరంపై ఆంక్షలు విధించాల్సిందే.

మౌలిక సదుపాయాలు కల్పించడం, సౌకర్యాలు కల్పించడం, ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచడం ముఖ్యం కావాలి. అభివృద్ధి నమూనా మారకుంటే రాష్ట్రం అధోగతి పాలుకకాక తప్పదు. ఈ విషయాలను గుర్తించి ప్రాంతీయ పార్టీలు పాలన సాగించాలి. అలాగే ప్రజాస్వామ్యంలో నిరంకుశ విధానాలను ఎవరు అవలంబించినా పతనం తప్పదు. అది గుర్తించకపోతే మనుగడ సాగించడం కూడా అంతే కష్టం. ప్రజల సౌకర్యాలను, అవసరాలను గుర్తించి ముందుకు సాగితే ఎంతకాలమైనా ప్రజలు ఆదరిస్తారు. అప్పుల భారం పెరుగుతున్న క్రమంలో ఉచితపథకాలను తగ్గించుకోవడం ద్వారా ప్రజలపై భారం పడకుండా చూడాలి. తాగు,సాగునీటితో పాటు, విద్యుత్, రోడ్డు వసతులను సంపూర్ణంగా అభివృద్ధి చేయాలి. విద్యా వైద్య రంగాలకు కేటాయింపులు పెంచి వసతులను మెరుగు పరచాలి. నిరుద్యోగ సమస్య మొత్తంగా పరిష్కరించకున్నా ఉపాధి అవకాశాలను పెంచాలి. అలాగే కేంద్ర రాష్ట్ర సంబంధాలు వేరు..రాజకీయ

పోరాటాలు వేరని గుర్తించాలి. రాష్ట్రాలకు సంబంధించి అనేక సమస్యలను ఎప్పుడూ నిలదీయడంలోనూ వెనకడుగు వేయరాదు. పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు కూడా గమనించాలి. అలాగే కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న అధికారిక సంబంధాలు వేరు. కేంద్రం కూడా పెద్దతరహాలో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. ఇదే సందర్భంలో తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా నీతి ఆయోగ్ ద్వారా హెచ్చరికలు చేయడం మంచిదే. ఫెడరల్ వ్యవస్థలో సిఎంలు ప్రధానిని ,కేంద్ర మంత్రులను, కేంద్ర అధికారులను కలవడం సర్వసాధారణం. ఇదే సందర్భంలో కేంద్ర రాష్ట్రాల మధ్య పన్నుల విధానంలో పారదర్శకత ఉండాలి. జీఎస్టీ విషయంలో ప్రధానంగా చర్చించాలి. ఏయే రంగగాలు కదులేవుతున్నదీ చర్చించాలి. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందగలదన్న విశ్వాసంతో కేంద్రం ముందుకు సాగాలి. అవినీతి విషయంలో కూడా ఎవరు చేసినా చట్టబద్దంగా శిక్షకు గురి కావాల్సిందే. ఇందులో బెదిరింపు రాజకీయాలకు తావుండరాదు. ఇకపోతే పలు పెండింగ్ ప్రాజెక్టులు, జీఎస్టీ నిధుల విడుదలకు సంబంధించి కేంద్రంతో సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ కూడా పరిష్కరించుకోవడం సిఎంల కర్తవ్యం. ఇవన్నీ కూడా పాలనలో భాగం కావాలి. ఓ వైపు రాష్ట్రాల అభవృద్ధికి కేంద్రం సహకరిస్తూనే..దేశం పురోగమించేలా చేయూతను ఇవ్వాలి. సమిష్టి కృషికి ఈ కొత్త ప్రభుత్వం ఆదర్శం కావాల్సి ఉంది.

# ఎపిని కలవరపెడుతున్న హింసా ఘటనలు

**అధికార పార్టీ ఎమ్మెల్యే పిన్నెల్లి తీరుపై ఆందోళన**

**కౌంటింగ్ కోసం భారీగా భద్రతా ఏర్పాట్లు**

హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:

ఎపిలో తాజా ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇవిఎంల ధ్వంసం నేరం అని తెలిసినా ఓ ఎమ్మెల్యే ఇలా తెగించడం దారుణం. అధికార పార్టీ ఎమ్మెల్యే పిన్నెల్లి తీరు రాజకీమాల్లో మాయని మచ్చగా నిలిచిపోనుంది. ఇకపోతే ఓట్ల లెక్కింపు రోజున రాష్ట్రంలో భారీగా అల్లర్లు జరుగుతాయనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పరస్పరం దాడులకు దిగే అవకాశం ఉందంటూ నిఘా విభాగం వరుస హెచ్చరికలతో చర్యలకు సిద్ధమయ్యారు. ఈ నెల 13న పోలింగ్ రోజు, ఆ తర్వాత చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాల్లో ముమ్మర గాలింపు చర్యలు మొదలయ్యాయి. మరీ ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగాలు పల్నాడు, రాయలసీమ జిల్లాల పోలీసు అధికారులను అప్రమత్తం చేశాయి. పోలింగ్ తర్వాత జరిగిన అల్లర్లను అడ్డుకోలేకపోవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం, ఎస్పీల నుంచి ఎస్ఐల దాకా అధికారులపై ఈసీ చర్యలతో ఇప్పటి నుంచే జాగ్రత్త పడుతున్నారు. కౌంటింగ్ రోజు ఎలాంటి హింసాత్మక ఘటనలకు అవకాశంఇవ్వకుండా పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగింది. ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగనుంది. అయితే తాజా ఘటనల నేపథ్యంలో ఔంటింగ్ ముగిసినా నెలాఖరు వరకూ కేంద్ర సాయుధ బలగాలను రాష్ట్రంలోనే కొనసాగించాలని సీఈసీ ఆదేశించింది. ఇప్పటికే కేంద్ర హోంశాఖ పంపిన 25 కంపెనీల ఫోర్స్....రాష్ట్రంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఉంది. కౌంటింగ్ అనంతరం అధికారంలోకి వచ్చే పార్టీ, ఓడిన పార్టీకి చెందిన శ్రేణులు పరస్పరం దాడులు చేసుకునే అవకాశం ఉందన్న నిఘా హెచ్చరికలతో ఈ బలగాలను కొనసాగిస్తున్నారు.

కొత్త ప్రభుత్వం ఏర్పాటై ప్రశాంత వాతావరణం ఏర్పడిన తర్వాతే కేంద్ర సాయుధ బలగాలు రాష్ట్రం నుంచి తిరిగి వెళ్లనున్నాయి. ఇకపోతే నిఘా వర్గాల హెచ్చరికతోపాటు పోలీసులకు అందిన సమాచారంతో మంగళవారం వేకువజాము నుంచే జిల్లాల్లో కార్డన్ సెర్చ్ మొదలైంది. సమస్యాత్మక ప్రాంతాలు, అనుమానిత వ్యక్తులు, ముఖ్యమైన కూడళ్లు, గడ్డి వాములు, పశువుల పాకలు, పండ్ల తోటలు.....ఇలా ఒకచోటంటూ లేకుండా జల్లెడ పడుతున్నారు. కత్తులు, ఇనుప రాడ్లు, కర్రలు, బరిసెలు, పేలుడు పదార్థాలు, మద్యం నిల్వలు, రికార్డుల్లేని వాహనాలు, అనుమానితుల కదలికలు ఏదీ వదిలి పెట్టడం లేదు. ఎటువంటి పత్రాలులేని 1104వాహనాలను జప్తు చేశామని, 482లీటర్ల నాటుసారా, సుమారు 480లీటర్ల నాన్ డ్యూటీ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ, గుడివాడ నియోజకవర్గాల్లో ఇంటింటికీ తిరిగి పోలీసులు తనిఖీలు సాగించారు. నూతన వ్యక్తుల సంచారంపై ఆరా తీశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సమస్యాత్మక గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు, పరిసరాలు, గడ్డి వాములలో మంగళవారం సోదాలు నిర్వహించారు. మారణాయుధాల కోసం అణువణువూ గాలించారు. అనకాపల్లి జిల్లాలో పోలీసులు మంగళవారం తనిఖీలు జరిపారు. ఎటువంటి పత్రాలు లేని 119 ద్విచక్ర వాహనాలను, ఐదు ఆటోలను, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు.జిల్లాల్లో ఎక్కడికక్కడ కా÷–డ్గ÷న్ సెర్చ్ (తనిఖీలు) చేపట్టి గట్టి చర్యలు తీసుకోవాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశించారు. ఈ ఆదేశాలతో ఎస్పీలు... జిల్లాల్లో బృందాలను ఏర్పాటుచేశారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసేవరకూ ఎలాంటి సెలవుల్లేవంటూ సిబ్బందితో పోలీసు అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా జల్లెడ పడుతున్నారు. పోల్ డే హింస జరిగిన ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించి... ప్రతి ఇల్లూ, ప్రతి మలుపులోనూ పోలీసులు తనిఖీ చేస్తున్నారు. ఎటువంటి మారణాయుధాలు ఉన్నా స్వచ్ఛందంగా ఇవ్వాలని, తాము గుర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయంటూ ఇళ్ల వద్దకెళ్లి అడుగుతున్నారు. కౌంటింగ్ హిస్టరీ షీట్స్ ఉన్న ప్రతి ఒక్కరినీ అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తున్నారు. సంఘ విద్రోహశక్తుల కదలికలపై నిఘాపెట్టి ఏ మాత్రం అనుమానం వచ్చినా అరెస్టు చేస్తున్నారు. వారిని దూరంగా ఉండే పోలీసు స్టేషన్లకు తరలిస్తున్నారు. పోలింగ్ రోజు హింసకు పాల్పడిన వేలాది మందిని వెతికేందుకు పదుల సంఖ్యలో పోలీసు బృందాలు తిరుగుతున్నాయి. రాష్ట్రం దాటి వెళ్లినవారిని సైతం రప్పించి మరీ అదుపులోకి తీసుకొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన మూడు రోజుల్లో 301 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు.



# ప్రాజెక్టుల రీ డిజైన్ కొంపముంచింది

**ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శలు**

మే22(అక్షరం న్యూస్: : కమీషన్ల కోసమే కేసీఆర్ ప్రాజెక్టులను రీ డిజైన్ చేశారని, దాని ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నామని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కమీషన్ల కోసమే రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను కాంట్రాక్టర్ మెఘా కృష్ణారెడ్డికి కట్టబెట్టారని వెల్లడించారు. దాని ఫలితమే ఇవాళ మేడిగడ్డ కుంగిపోవడం, మరమ్మత్తులకు కూడా కష్టంగా మారిందని అన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో బీఆర్ఎస్ నాయకులు తప్ప ఏ ఒక్క వర్గం బాగుపడలేదని విమర్శించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నంత కాలం రైతుకు శాపమని.. తేలిందని అన్నారు. సర్కార్ మారితేనే రైతులు బాగుపడ్తారని.. ఉద్యోగాలొస్తాయని చెప్పామని, ఇప్పుడు ఆ దిశగా సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కడితే మూడు నెలలకే మునిగిపోయిందన్నారు. కాంట్రాక్టర్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయాన్ని కేసీఆర్ లక్షకోట్లకు పెంచిండని ఆరోపించారు.కేసీఆర్ సొంత రాజ్యాంగంలో ప్రతిపక్షాలకు పోరాడే హక్కు.. మీడియాకు ప్రశ్నించే స్వచ్ఛ, న్యాయవాదులకు రక్షణ లేకుండా చేశారని అన్నారు. ఇవన్నీ విస్మరించి కెటిఆర్ సుద్దులు చెబుతున్నారని మండిపడ్డారు.

# ధాన్యం సేకరణలో నిర్దిష్ట లక్ష్యం

- **చివరి గింజవరకు కొనేలా ప్రణాళిక**
- **వరికొయ్యలను కాల్చవద్దని రైతులకు సూచన**

నిజామాబాద్,మే 22(అక్షరం న్యూస్:

జిల్లాలో ధాన్యం సేకరణ నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ శరత్ సూచించారు. వివిధ శాఖల అధికారులు,ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు , రైస్‌మిల్లర్లతో సమీక్షించి ఆదేశాలు జారీచేశారు. ప్రణాళిక ప్రకారం రోజూవారి లక్ష్యం నిర్దేశిరచుకొని కొనుగోలు పక్రియ పూర్తి చేయాలన్నారు.ప్రతిరోజు 9వేల మెట్రిక్ టన్నుల మేర, నాలుగు రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేసేలా తహసీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ అన్నారు.

పలు కేంద్రాల వద్ద ధాన్యం కాంటా చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. రైతులకు పూర్తిస్థాయిలో మద్దతు ధర అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 4.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ ఎ.శరత్ వెల్లడించారు. చివరి గింజను సైతం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉన్నదన్నారు. ట్యాబ్ ఎంట్రీ సకాలంలో పూర్తయితేనే రైతులకు వేగంగా బిల్లుల చెల్లింపులు జరుగుతాయన్నారు. కొనుగోలు కేంద్రానికి కొంత తక్కువ పరిమాణంలో ధాన్యం తెచ్చిన ఓ రైతు ప్రత్యేకాధికారిని కలిసి గత మూడు రోజుల నుంచి తన ధాన్యాన్ని తూకం చేయడం లేదని ఫిర్యాదు చేయడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే వరి కోశాక వరికొయ్యలను పొలాల్లో కాల్చడం ద్వారా అనేక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. ఒకటన్ను వరిగడ్డి కాల్చడం వల్ల 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియంతోపాటు 12కిలోల సల్ఫర్‌తోపాటు సేంద్రియ కార్బన్ సైతం కోల్పోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. పంట అవశేషాలను నేలలో చేర్చినట్లయితే నేలకు సేంద్రియ కార్బన్, నత్రజని అంది నేల సారవంతంగా మారుతుంది. మండే అవశేషాల నుంచి వచ్చే వేడి నేలలో ఉష్ణోగ్రతను పెంచుతుంది. దీనివలన ప్రయోజనకరమైన సూక్ష్మజీవులు మరణిస్తాయి. నేల ఆరోగ్యం కాపాడాలంటే అవశేషాలను కాల్చేయడం సరికాదన్నారు. భూసారాన్ని బట్టి పంటల సాగు చేపడితే అధిక దిగుబడులు పొందడమే కాకుండా భూమిలోని పోషకాలు చాలాకాలం పంటలకు అందే అవకాశం ఉంటుంది. దీంతో మంచి ఫలితాలు వచ్చి రైతులు ఆర్థికంగా బలపడే అవకాశం ఉంటుంది. వేసవిలో పంటలు పూర్తిగా చేతికి వచ్చిన తర్వాత రైతు తన పంటపొలంలో వ్యవసాయశాఖ అధికారి సూచనల మేరకు భూసార పరీక్షలు చేయించాలి. దాని ఫలితం ఆధారంగా తదుపరి మూడేళ్లపాటు సాగు చేసుకోవచ్చు.విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని సూచించారు. కేవలం అధీకృత డీలర్ షాపులో మాత్రమే కొనుగోలు చేయాలి. అనధికార వ్యక్తుల నుంచి కొనుగోలు చేయరాదు. విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత బిల్లు (రసీదు) తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లులో విత్తనం లాట్ నెంబర్, ముగింపు కాలపరిమితి వివరాలు చూసుకోవాలి. బిల్లుపై రైతు సంతకంతోపాటు అధీకృత డీలర్ సంతకం ఉండాలి. పంటకాలం ముగిసేవరకు విత్తన ప్యాకెట్, రసీదు భద్రంగా దాచిపెట్టుకోవాలి. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. ఏయే రకం విత్తనాలు కొనుగోలు చేయలో స్థానిక ఏఈవో, ఏవో సలహాలు తీసుకుంటే మరింత మంచిదన్నారు.

# చార్‌ధామ్ యాత్రికులకు నిరాశ

**ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ మూసివేతతో ఇబ్బందులు**

**మే 31న తెరచుకోనున్న రిజిస్ట్రేషన్**

డెహ్రాడూన్,మే22 అక్షరం న్యూస్:

హిందువులు ఎంతగానో ఎదురుచూసే చార్ ధామ్ కేదార్నాథ్ ఆలయ తలుపు తెరచుకోవడంతో ప్రారంభమైంది. ఉత్తరాఖండ్‌లోని చార్ ధామ్ యాత్రకు దేశ నలుమూలల నుంచి మాత్రమే కాదు విదేశాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు. ఊహించిన దానికంటే యాత్రలో భారీ సంఖ్యలో భక్తులు యాత్రకు పోటెత్తుతున్నారు. దీంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మే 31 వరకు ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం నిషేధించింది. చార్ ధామ్ యాత్ర కోసం హరిద్వార్, డెహ్రాడూన్‌లలో రవాణా శిబిరాలు ఏర్పాటు చేసారు. గత కొన్ని రోజులుగా ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.నాలుగు ధామ్‌లలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ మే 31 వరకు మూసివేయనున్నామని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి స్పష్టం చేశారు. దీంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న యాత్రికులు మాత్రమే ప్రస్తుతం యాత్రకు వెళ్లగలరు. ఇటువంటి పరిస్థితిలో ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న భక్తులు తమరిజిస్ట్రేషన్ కోసం తదుపరి ప్రభుత్వ ఉత్తర్వుల వరకు వేచి ఉండవలసి ఉంటుంది.. మరో వారం రోజుల పాటు కోసం వేచిచూడాలి. డెహ్రాడూన్, హరిద్వార్ జిల్లాల్లో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ క్యాంపులను ఏర్పాటు చేసింది. నిత్యం భారీ సంఖ్యలో భక్తులు ఇక్కడికి చేరుకుంటున్నారు. యాత్రకు వెళ్ళడానికి ఎంత సమయం అయినా ఈ శిబిరాల్లో వేచి చూస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.మే 31 వరకు చార్ ధామ్ కొత్త భక్తులను ఆహ్వానించవద్దని ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికే చేరుకున్న వేలాది మంది పర్యాటకులు హరిద్వార్‌లోని హోటల్ ధర్మశాలలో ఉన్నారు. రిజిస్ట్రేషన్ తెరిచే సమయం కోసం వేచి చూస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో హరిద్వార్ టూర్ అండ్ ట్రావెల్స్ వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అంగట్లో అమ్మకానికి 3 నెలల పసికందు

**స్వచ్ఛంద సంస్థ చొరవతో బయటపడ్డ వ్యవహారం**

హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:

నగరంలో 3 నెలల పసికందును అమ్ముతున్న ముఠాని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సభ్యసమాజం తలదించుకునేలా కొందరు మహిళలు ఈ దురాగతానికి పాల్పడ్డారు. వీరు మానవత్వం మరచి అంగట్లో ఆడబిడ్డను అమ్మకానికి బేరం పెట్టారు. ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా వీరి గుట్టు రాట్టయ్యింది. అక్షర జ్యోతి ఫౌండేషన్ కి చెందిన మహిళలు తమకు ఆడిపిల్ల కావాలని స్టింగ్ ఆపరేషన్ చేయగా మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిరామకృష్ణ నగర్‌లో శోభారాణి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ లో ఆర్ ఎం పీ వైద్యురాలు శోభారాణి ఈ పని చేస్తుందని ఆమెని సంప్రదించగా, అమ్మాయి ని 4.50 లక్షలకు ఇప్పిస్తానని ఫోన్ ద్వారా చెప్పింది. దీంతో.. ముందుగా 10 వేలు అడ్వాన్స్ గా చెల్లించి, బుధవారం నాడు పాపకోసం వారు క్లినిక్ కు రాగ వేరే మహిళా అక్కడకు ఓ పాపతో వచ్చి వీరికి అప్పగించారు. దీంతో సంస్థ మహిళలు పోలీసులకు, మీడియాకు సమాచారంఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వీరందరిని పోలీస్ స్టేషనకు విచారణ కోసం తరలించారు. పేద కుటుంబం పిల్లలను పోషించడం భారమణి తల్లి చెప్పడంతో మానవత్వంతో అమ్మాయిని పిల్లలు లేనివారికి అమ్మానని శోభరాణి చెప్పడం కోసమెరుపు. శోభారాణి ఇంకా కొన్ని హాస్పిటల్ పేర్లు, చిలకనగర్‌లో మరో మహిళా ఆర్ ఏం పీ, మ్యారేజ్ బ్యూరో మహిళా పేర్లను వారి వివరాలను కూడా తెలియజేసినట్టు సమాచారం. వీరందరు కలిసి ఈ పని చేసినట్టు తెలియజేసింది

# ఈవీఎం ధ్వంసం చేసినా డేటా భద్రం

- ఘటనలన్నీ వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించాం
- కొత్త ఈవీఎంలతో పోలింగ్ కొనసాగించాం
- 10 సెక్షన్ల కింద పిన్నెల్లిపై కేసులు పెట్టాం
- పిన్నెల్లి అరెస్ట్‌కు పోలీసుల గాలింపు
- ఏడేళ్ల జైలు కాయం అన్న సిఇవో ముఖేశ్ కుమార్ మీనా



అమరావతి,మే22(అక్షరం న్యూస్:

పోలింగ్ రోజున ఏపీలో మొత్తం 9 చోట్ల ఈవీఎంలు ధ్వంసమయ్యాయని.. మాచర్లలో 7 ఘటనలు చోటుచేసుకున్నట్లు సీఈవో ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఈవీఎంలను ధ్వంసం చేశారు. ఘటనలన్నీ వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించాం. ఈవీఎం ధ్వంసం చేసినా డేటా భద్రంగా ఉంది. దీంతో కొత్త ఈవీఎంలతో పోలింగ్ కొనసాగించామని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి సిట్‌కు పోలీసులు అన్ని వివరాలను అందించారు. 20న రెంటచింతల ఎస్ఐ కోర్టులో మెమో దాఖలు చేశారు. మొదటి నిందితుడిగా పిన్నెల్లిని పేర్కొన్నారు. 10 సెక్షన్ల కింద పిన్నెల్లిపై కేసులు పెట్టారు. ఏడేళ్ల వరకూ శిక్షలు పడే అవకాశం ఉంది. ఆయనను అరెస్టు చేయడానికి పోలీసు బృందాలు వెళ్లాయి. మిగతా చోట్ల కూడా కేసులు పెట్టి దర్యాప్తు చేస్తున్నాం. ఎవర్నీ వదిలే ప్రసక్తి లేదు. ఈ ఘటన నమోదు అయిన సమయంలో ఈసీ ఆదేశాలతో బదిలీలు జరిగాయి. ఈవీఎం ధ్వంసం ఘటనలో మేమేమీ దాచిపెట్టలేదు. ఘటన జరిగిన మరుసటి రోజే ఆధారాలను పోలీసులకు అప్పగించాం అని సీఈవో స్పష్టం చేశారు. ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనను సిగ్గుమాలిన చర్యగా ఈసీ పేర్కొంది. ఇలాంటి ఘటనలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో వైఫల్యంగా ఈసీ దీనిని గుర్తించిందని సీఈవో తెలిపారు. మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని పీఎస్ నంబర్ 202తో పాటు 7 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను ధ్వంసం చేయడంపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయింది. రాష్ట్ర ఎన్నికల అధికారికి నోటీసులు పంపింది. ఈవీఎంను ధ్వంసం చేసిన ఘటనపై వెంటనే వివరణ ఇవ్వాలని.. అలాగే ఈ ఘటనపై ఎమ్మెల్యే పిన్నెల్లి పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే ఈ ఘటనపై సాయంత్రం ఐదు గంటల లోపు నివేదిక ఇవ్వాలని సీఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని ఈసీ చాలా తీవ్రంగా పరిగణిస్తూ, ఈ ఘటనల్లో ప్రమేయం ఉన్న వ్యక్తులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి సూచించాలని సీఈవో ముఖేష్ కుమార్ మీనాను ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించే విషయంలో భవిష్యత్తులో ఎవరూ ఇటువంటి దుశ్చర్యలకు సాహసం చేయకుండా కఠినంగా వ్యవహరించాలని ఈసీ ఆదేశించింది.

## సినిమాను తలపిస్తున్న పిన్నెల్లి ఛేజింగ్

- అరెస్ట్‌ను తప్పించుకునేందుకు పారిపోయే యత్నం
- సంగారెడ్డి వద్ద కారును, సెల్‌ఫోన్లను వదిలి పరారు
- బీదర్ వైపు వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు

పల్నాడు,మే22అక్షరం న్యూస్:

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎపిసోడ్‌లో సినిమాను మించిన ట్విస్ట్‌లు నడుస్తున్నాయి. పిన్నెల్లి కోసం చేజింగ్ నడుస్తోంది. ఈవీఎం ధ్వంసంకేసులో నిందితుడైన పిన్నెల్లిని అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు ప్రయత్నిస్తుండగా.. అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు పిన్నెల్లి పారిపోయే ప్రయత్నం చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలంగాణ సరిహద్దులు దాటి బీదర్ వైపు వెళ్లినట్లు పోలీస్ బృందాలకు సమాచారం అందింది. అంతకు ముందు సంగారెడ్డి పట్టణానికి సమీపంలోని కంది వద్ద తన కారు, డ్రైవర్, మొబైల్‌ను వదిలేసి పిన్నెల్లి వేరే వాహనంలో వెళ్లిపోయినట్లు ఏపీ పోలీస్ బృందాలు గుర్తించాయి. అక్కడి నుంచి మహారాష్ట్రలోని బీదర్ వైపు వెళ్తున్నారని ట్రాక్ చేశారు పోలీసులు. ఈ క్రమంలో అలర్ట్ అయిన ఏపీ పోలీస్ ఉన్నతాధికారులు.. బీదర్ వైపునకు ఏపీ, తెలంగాణ టీమ్స్ వెళ్లాలని కోరారు. దీంతో అటు ఏపీ, ఇటు తెలంగాణ పోలీసులు బృందాలుగా ఏర్పడి.. పిన్నెల్లిని పట్టుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. పాల్వాయి గేట్ గ్రామంలో పోలింగ్ బూత్‌లో ఈవీఎం ద్వంసం చేయడాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎన్నికల సంఘం.. ఆయన్ను అరెస్ట్ చేయాలని ఆదేశించింది. దీంతో అప్పటి నుంచి పరారీలో ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైదరాబాద్ నుంచి తన కారులో పరార్ అయ్యారు. తొలుత సంగారెడ్డి సమీపంలో తన కారు దిగి మొబైల్ ఫోన్‌ను కూడా అక్కడే వదిలేసి రామకృష్ణారెడ్డి వెళ్లిపోయాడు. మొత్తంగా ఈ వ్యవహారం ఏపీ రాజకీయాల్లో మరింత రసవత్తరంగా మారింది. పిన్నెల్లో పట్టుకునేందుకు పోలీసులు.. ఆ పోలీసుల నుంచి తప్పించుకునేందుకు పిన్నెల్లి.. సినిమాను మించిన ఛేజింగ్ నడుస్తోంది. ఒకవేళ పిన్నెల్లి దొరికితే.. ఆయనపై తీవ్రమైన కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. ఈవీఎం ధ్వంసం చేసిన సంఘటనపై రెండు సంవత్సరాలు శిక్ష పడే అవకాశం ఉంది. ఈ భయంతో పిన్నెల్లి పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. పిన్నెల్లిపై అదనపు సెక్షన్లు కూడా పెట్టేందుకు కోర్టులో మెమో వేయాలని పోలీసులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. పిన్నెల్లిపై హత్యాయత్నం కేసు కూడా నమోదు చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

## కేజ్రీవాల్‌ను చంపుతానంటూ బెదిరింపులు

- వ్యక్తిని గుర్తించి అరెస్ట్ చేసిన పోలీసులు

న్యూఢిల్లీ,మే22(అక్షరం న్యూస్:

ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్‌ను చంపుతానని బెదిరిస్తూ గ్రాఫిటీ వేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ద్వారా నిందితుడిని గుర్తించి బుధవారం అరెస్టు చేశారు. అతడిని బరేలీకి చెందిన అంకిత్ గోయల్‌గా గుర్తించారు. ఢిల్లీ పోలీసుల మెట్రో యూనిట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని, ప్రస్తుతం ఈ విషయంపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు. పరిణామంపై ఆప్ స్పందించింది. ఈ ఘటన వెనుక బీజేపీ హస్తం ఉందని ఆరోపించింది.ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు నియోజకవర్గాల్లో ఓటమి పాలవుతుందన్న భయంతోనే ఈ చర్యలను పాల్పడుతున్నారని తెలిపింది.

## తెలంగాణలో మరో మూడు రోజులు వర్షాలు

హైదరాబాద్,మే22అక్షరం న్యూస్:

తెలంగాణలో మరో మూడురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 23న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. 24న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొంది. 25న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది.

## ప్రమాదంలో వ్యక్తి మృతి

- కారుకుడి ఇంటిముందు కుటుంబం ధర్నా

యాదగిరిగుట్ట,మే22అక్షరం న్యూస్:

కుటుంబ సభ్యుడి మృతికి కారణమైన బాధితుడి ఇంటి ముందు మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహంతో అదోళనకు దిగారు. తన ఇంటిదిక్కును కోల్పోయామని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సుమారు 500 మందికి పైగా గ్రామస్తులు, బంధువులతో ధర్నా చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. యాదాద్రి భువనగిరి జిల్లా సాదువెల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్(32) యాదగిరిగుట్టకు తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. సైదాపురం గ్రామ శివారుకు చేరుకోగానే ఎదురుగా పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన భరత్ బైక్‌పై వచ్చి వేగంగా ఢీ కొట్టాడు. దీంతో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడటంతో హైదారాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయామని తమకు నష్ట పరిహారం ఇవ్వాలంటూ మృతుడి భార్య మహేశ్వరి , తండ్రి రాములు బుధవారం భరత్ ఇంటి ముందు మృతదేహంతో ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకుని బాధిత కుటుంబంతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పారు.

## 41 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సిద్దిపేట,మే222అక్షరం న్యూస్:

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం పెద్దరాజుపేట గ్రామ శివారులో డీసీఎం ద్వారా అక్రమంగా తరలిస్తున్న 41 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని చేర్యాల సీఐ శ్రీను పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే పెద్దరాజుపేట గ్రామ శివారులో నూనె వెంకట్ అనే వ్యక్తి డీసీఎంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు.

బియ్యం లోడ్ వెళ్తున్న డీసీఎం వ్యాన్ స్వాధీనం కేసు నమోదు చేసిన దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు .ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేసినా నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాల పై పటిష్టమై నిఘా ఏర్పాటు చేశామని, చట్టవ్యతిరేక చర్యలకు ఎవరు పాల్పడినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# వర్షాలు పడతాయని హెచ్చరికలు

- ధాన్యం కొనుగోళ్లలో కదలని అధికారులు
- సన్నాలకే బోసన్ అంటూ మెలిక పెట్టడం సరికాదు
- బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు





సిద్దిపేట,మే22(అక్షరం న్యూస్:

: తుఫాన్ ప్రభావంతో వచ్చే మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా ప్రభుత్వం మాత్రం రోజుల తరబడి వడ్లు కొనకపోవడం వల్ల వడ్లు తడిచే అవకాశం ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా చిన్నకోదూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మీడియాతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు కల్లాల్లో పడిగాపులు కాచే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. తడిసిన వడ్లతో సహా అన్ని వడ్లను కొంటున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేలా ఉందన్నారు. చిన్నకోదూరు కేంద్రాల్లో రైతులు 20 రోజులుగా వేచి చూస్తున్నారని చెప్పారు. ధాన్యం ఒకటికి రెండుసార్లు తడిసి మొలకెత్తింది. ధాన్యం రైస్ మిల్లుకు వెళ్లాక తేమ శాతం ఎక్కువ ఉందని, మొలకెత్తిందని కొనడం లేదని పేర్కొన్నరు. ఒక వేళ కొన్నా తరుగు తీసేయడం వల్ల సంచికి మూడు కిలోలు కోతపెట్టే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. తరుగు లేకుండా వెంటనే వడ్లు కొనాలని డిమాండ్ చేశారు. చిన్నకోదూరు రైతులతో మాట్లాడినప్పుడు ఇంటి అవసరాలకు మాత్రమే సన్న వడ్లు పండిస్తామని, మిగతా వడ్లన్నీ దొడ్డువడ్లేనని చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెస్ అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం సన్నవడ్లకే ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లాలో 3,38,389 ఎకరాల్లో వరి సాగయింది. 3 లక్షల 29 వేల ఎకరాల్లో దొడ్డు రకం వేశారు. 16 వేల ఎకరాల్లో మాత్రమే సన్నరకం వేశారు. రూపాయికి 95 శాతం దొడ్డువడ్లు పండించే వాళ్లకు బోనస్ ఎగ్గొట్టి , కేవలం ఐదు శాతం సన్నబడ్లు పండించే వాళ్లకు బోనస్ ఇస్తామనడం రైతులను దగా చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. విత్తానాల కోసం రైతుల పాస్ పుస్తకాలు లైన్లో పెట్టి వేచి చూసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మంత్రులు కల్లాల్లో తిరిగేవాళ్లు. ఇప్పుడు ఒక్క మంత్రి కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించడం లేదని విమర్శించారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్న విషయం తెలుసుకోవడానికి మంత్రులు కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని డిమాండ్ చేశారు.అన్ని రకాల వడ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతులకు వడ్ల బోనస్ విషయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. డబ్బాలో ఓట్లు పడి, సీల్ పడ్డాక రైతులకు చావు కబురు చల్లగా చెబుతున్నారని ధ్వజమెత్తారు. చిన్న కోదూరు మండల కేంద్రంలో బుధవారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులతో హరీశ్‌రావు మాట్లాడి వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అధికారంలోకి రావడానికి బాండ్ పేపర్ మీద 6 గ్యారెంటీలను రాసిన విధంగానే సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం బోనస్ విషయంలో ఆలోచించి సన్నవడ్లకే కాకుండా దోడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులను రైతులు గ్రామాల్లో నిలదీస్తారని అన్నారు. తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## స్త్రీనిధిలో పాతుకు పోయిన రిటైర్డ్ ఉద్యోగులు

- అవకతవకల నేపథ్యంలో విచారణకు మంత్రి ఆదేశం
- కోడ్ ముగిసిన తరవాత చర్యలకు రంగం సిద్దం

వరంగల్,మే22(అక్షరం న్యూస్:

తెలంగాణ స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్లో రిటైర్డ్ ఉద్యోగుల పెత్తనం, సిఎస్ఆర్ నిధుల మళ్లింపు, ఇతర అభియోగాల నేపథ్యంలో స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య లిమిటెడ్ పై మంత్రి సీతక్క జనవరి నెలలో సమీక్ష నిర్వహించి స్త్రీనిధిలో అవినీతి ఆరోపణలపై విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం ఆ సమాఖ్యకు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎ.జి.యం స్థాయి విశ్రాంత నాబార్డ్ అధికారి అయిన జి.విద్యాసాగర్ రెడ్డి గత 13 సంవత్సరాలుగా కొనసాగుతున్నారు. ఈయనతో పాటు ఉన్నత స్థాయిలో డి.జి.యం పోస్టుల్లో బి.విద్య సాగర్ రెడ్డి, నర్సింహ రెడ్డి, వెంకట్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రాజరావ్, రవికుమార్, ఏర్రమల్ల.రమేష్ లాంటి అగ్రవర్ణ రిటైర్డ్ ఉద్యోగులు సంవత్సరాల తరబడి సంస్థలో పాతుకు పోయారని సమాచారం. రిటైర్డ్ ఉద్యోగులు ఏళ్లకు ఏళ్లు కొనసాగుతుండటం ద్వారా సంస్థలో వున్న సీనియర్ ఉద్యోగులకు ప్రమోషన్లు రాకపోవడటంతో పాటు వారి వేధింపుల వలన సుమారుగా 400 మంది ఉద్యోగులు రాజీనామా చేసి వెళ్లిపోవడం జరిగింది. ఇదే విషయమై పలుమార్లు పాత,కొత్త ప్రభుత్వానికి, మంత్రులకు, ముఖ్యమంత్రి ప్రజావాణిలో వరుసగా పిర్యాధులు వెళ్లిన నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. అంతే కాకుండా తమ హక్కుల గురించి ప్రశ్నించిన యస్సీ, ఎస్టీ బీసీ ఉద్యోగులను టార్గెట్ చేస్తూ వారిపై అక్రమ బదిలీలు, ప్రమోషన్ల నిరాకరణ, వారి ఫోన్లను ట్యాపింగ్ చేయడం, జీపీఎస్ ట్రాకింగ్ చేయడం, తప్పుడు ఫిర్యాదులు స్వీకరించి నిరాధార ఆరోపణలతో తప్పుడు వార్తలు వ్రాయించడం లాంటివి చేయడంతో వేధింపులు భరించలేక 6 గురు బాధిత ఉద్యోగులు జాతీయ రాష్ట్ర యస్సీ, ఎస్టీ, బిసి, మానవ హక్కుల కమిషన్ ,లేబర్ కమిషన్లను అశ్రయించడం జరగింది. అంతే కాకుండా స్త్రీ నిధి బోర్డుకు అప్పీల్ చేసుకోగా బోర్డు సభ్యులు సానుకూలంగా స్పందిస్తూ స్త్రీనిధి కి చాలా సంవత్సరాల నుండి సేవా చేస్తున్నారు కాబట్టి తొలగించడం కాకుండా మైనర్ పెనాలిటిని విధించి విధుల్లోకి తీసుకోవాలనే తీర్మానం చేయాలని చెప్పగా స్త్రీ నిధి యం.డి విద్యాసాగర్ రెడ్డి అట్టి ప్రతిపాదనను ఒప్పుకోకుండ ప్రిన్సిపల్ సెక్రటరీ మీటింగ్ కు రాలేదనే సాకుతో ఆ నిర్ణయాన్ని అమలుచేయలేదు. తదుపరి సమావేశంలో 15 మంది డైరెక్టర్లు సానుకులంగా స్పందించినా ప్రిన్సిపల్ సెక్రెటరీ ఒప్పుకోలేదని అప్పీల్ రిజెక్ట్ చేయడం జరిగింది. ఈ విధంగా యస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులను టార్గెట్ చేస్తున్నా విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి సంస్థ ఉద్యోగులు, ఎస్సీ ఎస్టీ, బిసి కుల సంఘాల బాధ్యులు తీసుకువెళ్ళారు. ఈ క్రమములో ప్రభుత్వం అన్ని శాఖలలో, బోర్డులు, కార్పొరేషన్లలో పాతుకు పోయిన విశ్రాంత అధికారుల వివరాలు సేకరించి తొలగించేందుకు రంగం సిద్ధం చేసిందని తెలిసింది, మంత్రిగారు స్పందిస్తూ స్త్రీ నిధిలోని రిటైర్డ్ ఉద్యోగుల తొలగింపు అనేది కూడా ప్రభుత్వం దృష్టిలో వుంది కానీ ఎలక్షన్ కోడ్ కారణంగా నిర్ణయం తీసుకోలేకపోతున్నాము, కోడ్ ముగిసిన వెంటనే చర్యలు వుంటాయని తెలియజేశారు. స్త్రీ నిధి పరపతి సహకార సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ జి.విద్యాసాగర్ రెడ్డి తొలగింపు అనివార్యం కావడంతో, కేవలం మేనేజింగ్ డైరెక్టర్గా తొలగించడమే కాకుండా ఆయన పీరియడ్లో జరిగిన స్త్రినిధి లావాదేవీలను, నిధుల మళ్లింపు, ఐబీ ఫండ్, నైబర్ హుడ్ సెంటర్లు, వి.ఎల్.ఇ కమిషన్, పాలకుర్తి టైలరింగ్, శిక్షణ కార్యక్రమాలలో జరిగిన ఖర్చులు, జనరల్ బాడీ సమావేశం ఖర్చులు, కొనుగోలు లాంటి వాటిపై విజిలెన్స్ విచారణ జరపించి చర్యలు తీసుకోవాలని గిరిజన, ప్రజా సంఘాల కోరుతున్నారు.

## షారూఖ్ ఖాన్‌కు గుండెపోటు!

హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:
బాలీవుడ్ బాద్ షా, కోల్‌కతా నైట్‌రైడర్స్ కో-ఓనర్ షారూఖ్ ఖాన్ గుండె పోటుకు గురైనట్లు తెలుస్తోంది. అతన్ని హుటా హుటిన అహ్మదాబాద్‌లోని కేడీ ఆసుపత్రికి తరలించినట్లు నేషనల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. బాలీవుడ్ బాద్ షా ఆసుపత్రి పాలయ్యాడనే వార్త.. అతని అభిమానులతో పాటు కేకేఆర్ ఫ్యాన్స్‌ను కలవరపెడుతోంది. ఐపీఎల్ 2024 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1లో కేకేఆర్ 8 వికెట్ల తేడాతో గెలిచి ఫైనల్ చేరిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌కు హాజరైన షారూఖ్ ఖాన్ తన జట్టుకు అండగా నిలిచాడు. విజయానంతరం మైదానం మొత్తం తిరుగుతూ అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశాడు. కేకేఆర్ ఫైనల్ చేరడంతో తెగ సంతోషం వ్యక్తం చేశాడు. తన కూతురు, కొడుకుతో కలిసి సంబరాలు చేసుకున్నాడు. గాడ్ ఆఫ్ ఆన్ ఇచ్చే క్రమంలో లైవ్‌లో మాట్లాడుతున్న సురేశ్ రైనా, ఆకాశ్ చోప్రాలను పలకరించాడు. లైవ్‌లో ఉన్న విషయాన్ని గ్రహించి వారికి క్షమాపణలు కూడా చెప్పాడు. కేకేఆర్ గెలిచిందనే సంతోషం ఎక్కువైందో? లేక ఇతర ఆరోగ్య కారణాలు తెలియదు కానీ.. షారూఖ్ ఖాన్‌కు గుండెపోటు వచ్చినట్లు తెలుస్తుంది. అయితే అతని హెల్త్ అప్‌డేట్‌పై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇటీవల షారూఖ్ ఖాన్ నటించిన పఠాన్, జవాన్, డంకీ చిత్రాలు సూపర్ డూపర్ హిట్టయ్యాయి. ప్రస్తుతం ఐపీఎల్ 2024 సీజన్‌తో బిజీగా ఉన్న షారూఖ్ ఖాన్.. కేకేఆర్ ఆడే ప్రతీ మ్యాచ్‌కు హాజరయ్యాడు. తన స్పీచ్‌లతో ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేశాడు.

## ప్లే ఆఫ్స్‌లో కింగ్ కోహ్లీ గత రికార్డులు శూన్యం

హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:



వరుస ఓటములతో ఆరంభమై ఇప్పుడు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన ఆర్సీబీ ఈ మ్యాచ్‌లో తొలిసారి విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ గెలవాలంటే జట్టు మొత్తం కలిసి అద్భుత ప్రదర్శన చేయాలి. ముఖ్యంగా టోర్నీ మొత్తం పరుగుల వర్షం కురిపించిన విరాట్ కోహ్లి ఈ మ్యాచ్ లోనూ రెచ్చిపోవాల్సిందే. అయితే లీగ్ స్థాయిలో పరుగుల వర్షం కురిపించే కింగ్ కోహ్లి ప్లేఆఫ్ ప్రదర్శన అంతగా కనిపించకపోవడంతో.. ఈ మ్యాచ్ కు ముందు ఆర్సీబీ అభిమానుల్లో ఆందోళన పెరిగింది. నిజానికి ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ విరాట్. ఈ వెర్షన్‌లో అతని వద్ద ఆరెంజ్ క్యాప్ కూడా ఉంది. ఐపీఎల్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో భాగంగా బుధవారం (మే 22) న ఆర్సీబీ , రాజస్థాన్ రాయల్స్ తలపడనున్నాయి. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో రాత్రి 7:30 గంటలకు మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి క్వాలిఫయర్ 2కి చేరుకోవాలని ఇరు జట్లు ఉవ్విళ్లూరుతున్నాయి. లీగ్ మ్యాచ్‌ల్లో విరాట్ బాగా బ్యాటింగ్ చేస్తాడు. కానీ ప్లేఆఫ్స్‌లో కోహ్లీ అంతగా ఆకట్టుకోవడం లేదని అతని గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఐపీఎల్ చరిత్రలో విరాట్ ప్లేఆఫ్ మ్యాచ్‌ల రికార్డు గురించి మాట్లాడితే, ఇప్పటివరకు కోహ్లీ 14 మ్యాచ్‌లు ఆడాడు, అందులో అతను 308 పరుగులు చేశాడు. ఇందులో కేవలం 2 సెంచరీలు మాత్రమే ఉన్నాయి. ఈ సమయంలో కోహ్లీ స్ట్రైక్ రేట్ కేవలం 25.66 సగటు 120గా ఉంది. ఇది %=జదీ% అభిమానులను కలవరపెడుతోంది. అయితే ఈ సీజన్‌లో కోహ్లీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో నేటి ఎలిమినేటర్ మ్యాచ్‌లో కూడా విరాట్ లీగ్ మ్యాచ్‌ల్లో రాణిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ సీజన్‌లో విరాట్ ఆడిన 14 మ్యాచ్‌ల్లో 155.60 స్ట్రైక్ రేట్‌తో 708 పరుగులు చేశాడు. ఇందులో 1 సెంచరీ కూడా ఉంది. ఐపీఎల్ 2024లో ఇప్పటివరకు విరాట్ కూడా 59 ఫోర్లు, 37 సిక్సర్లు కొట్టాడు.

## అంబటి రాయుడు పూటకో మాట!



హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:
ఐపీఎల్ 2024 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)పై తన అక్కసు వెళ్లగక్కిన టీమిండియా వెటరన్ క్రికెటర్ అంబటి రాయుడు యూటర్న్ తీసుకున్నాడు. మొన్న చెన్నై సూపర్ కింగ్స్‌పై ఆర్‌సీబీ సాధించిన విజయాన్ని రాయుడు ఎగతాళి చేసిన విషయం తెలిసిందే. ప్లే ఆఫ్స్ చేరితేనే ఆర్‌సీబీ, ఆ జట్టు అభిమానులు టైటిల్ గెలిచిన రీతిలో సంబరాలు చేసుకుంటున్నారని సెటైర్లు పేల్చాడు. అంతేకాకుండా ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ ఓడిపోవాలని కూడా కోరుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. ఆర్‌సీబీ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టార్ స్పోర్ట్స్ షోలో సహచర కామెంటేటర్ వరుణ్ అరుణ్.. ఆర్‌సీబీ టైటిల్ గెలుస్తుందని చెప్పగా.. రాయుడు ఎగతాళి చేశాడు. ఇప్పటికే టైటిల్ గెలిచిందనే రీతిలో సంబరాలు చేసుకుంటున్నారని ఆర్‌సీబీ విజయాన్ని తక్కువ చేసి మాట్లాడాడు. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఓడిపోతుందని కూడా చెప్పాడు. క్వాలిఫయర్-1 మ్యాచ్ సందర్భంగా కూడా రాయుడు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఈ సారి సౌత్ టీమ్ టైటిల్ గెలుస్తుందని, ఆర్‌సీబీ విజేతగా నిలుస్తుందని దిగ్గజ కామెంటేటర్ సునీల్ గవాస్కర్ అనగా.. రాయుడు అతని వ్యాఖ్యలతో ఏకీభవించాడు. కానీ ఆర్‌సీబీ గెలవదని చెప్పాడు. ఐపీఎల్ 2024 టైటిల్‌ను సౌత్ టీమ్ గెలుస్తుందని, కానీ ఆర్‌సీబీ మాత్రం కాదని, సన్‌రైజర్స్ హైదరాబాద్ విజేతగా నిలుస్తుందని చెప్పాడు. తాజాగా రాజస్థాన్ రాయల్స్, ఆర్‌సీబీ ఎలిమినేటర్ మ్యాచ్ నేపథ్యంలో రాయుడు యూటర్న్ తీసుకున్నాడు. ఆర్‌సీబీ టైటిల్ గెలుస్తుందని ఆశిస్తున్నానని చెప్పాడు. 'ఆర్‌సీబీ టైటిల్ గెలవాలని నేను మనస్పూర్తిగా కోరుకుంటున్నా. ఈ సారి ఆ జట్టుకు మంచి అవకాశం దక్కింది. సీఎస్‌కే కూడా లేదు. కాబట్టి ఆ జట్టు మరో మూడు మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తుందని ఆశిస్తున్నా.'అని తెలిపాడు. అయితే రాయుడు పూటకో మాట మాట్లాడటంపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్‌సీబీ జట్టుదే టైటిల్: రికీ పాంటింగ్



హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:
ఐపీఎల్ 2024 సీజన్ టైటిల్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) గెలుచుకుంటుందని ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్, ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ అన్నాడు. ఈ సీజన్‌లో ఆ జట్టు కనబర్చిన అసాధారణ ప్రదర్శన చూస్తుంటే టైటిల్ గెలిచినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నాడు. ఈ టోర్నీ ఫస్టాఫ్ సీజన్‌లో 8 మ్యాచ్‌లకు ఒకే ఒక్క విజయం సాధించిన ఆర్‌సీబీ.. ఆ తర్వాత వరుసగా 6 విజయాలతో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో పటిష్టమైన చెన్నై సూపర్ కింగ్స్‌ను మట్టికరిపించింది. ఈ గెలుపుతో పాటు మెరుగైన రన్‌రేట్‌తో టోర్నీలో ముందడుగు వేసింది. ఆర్‌సీబీ టైటిల్ గెలవాలంటే మరో మూడు మ్యాచ్‌లు గెలవడం కీలకం. ఈ టోర్నీ ముగియగానే జూన్ 1 నుంచి అమెరికా వేదికగా టీ20 ప్రపంచకప్ ప్రారంభం కానుంది. ఈ మెగా టోర్నీ నేపథ్యంలో ఐసీసీ వెబ్‌సైట్‌తో రికీ పాంటింగ్ మాట్లాడాడు. ఈ సందర్భంగా ఆర్‌సీబీ ఐపీఎల్ టైటిల్ గెలుస్తుందని జోస్యం చెప్పాడు. 'గత 6 మ్యాచ్‌ల్లో ఆర్‌సీబీ అసాధారణ ప్రదర్శన కనబర్చింది. ఈ సీజన్ టైటిల్‌ను ఆ జట్టు గెలిచినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.'అని పాంటింగ్ చెప్పుకొచ్చాడు. ఇక విరాట్ కోహ్లీ స్ట్రైక్‌రేట్‌పై వస్తున్న విమర్శలను పాంటింగ్ తప్పుబట్టాడు. కోహ్లీలాంటి ఆటగాడిని పక్కనపెట్టడం సరికాదన్నాడు.'నేను టీమిండియా సెలెక్టర్‌గా ఉంటే ముందుగా విరాట్ కోహ్లీని ఎంపిక చేసేవాడిని. విరాట్ కోహ్లీపై వస్తున్న విమర్శలు చాలా ఫన్నీగా ఉన్నాయి. కొంతమంది పనిగట్టుకొని కోహ్లీ టీ20 ఫార్మాట్‌కు పనికిరాడనే కారణాలను వెతుకుతున్నారనిపిస్తోంది. ఇతర ఆటగాళ్లతో కోహ్లీ పోల్చుతూ.. విమర్శలు గుప్పించే ప్రయత్నం చేస్తున్నారు. టాపార్డర్‌లో కోహ్లీ తన పాత్ర సమర్థవంతంగా నిర్వర్తించగలడు. సూర్యకుమార్ యాదవ్ తన జోరును కొనసాగిస్తే.. రోహిత్ శర్మ కూడా చెలరేగుతాడు. టాప్-3 బ్యాటర్లు రాణిస్తే ఇతర బ్యాటర్లు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయగలరు. టీ20 ఫార్మాట్ నాలుగేళ్ల క్రితం ఉన్నట్లు లేదు. పూర్తిగా మారిపోయింది. 60 బంతులాడి 80, 100 పరుగులు చేసేవారి కంటే.. 15 బంతుల్లో 40 పరుగులు చేసేవారు మ్యాచ్ ఫలితాన్ని తారు మారు చేస్తున్నారు.'అని పాంటింగ్ చెప్పుకొచ్చాడు.

## 'సమయం ఆసన్నమైంది'.. ధోని సంచలన పోస్ట్



హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:
ఐపీఎల్ 17వ సీజన్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్ సర్దుకుంది. కీలక మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించి 14 పాయింట్లతో ప్లేఆఫ్స్‌లో నాల్గవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఓటమి కారణంగా చెన్నై ప్లేఆఫ్ కల అసంపూర్తిగా మిగిలిపోయింది. ప్లే ఆఫ్స్ లో భాగంగా కోల్‌కతా నైట్ రైడర్స్ మంగళవారం మే 21న సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. మరికాసేపట్లో రాజస్థాన్ రాయల్స్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. అంతకు ముందు టీమిండియా మాజీ కెప్టెన్, చెన్నై వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ మహేంద్ర సింగ్ ధోనీ ఫేస్‌బుక్‌లో ఓ పెద్ద ప్రకటన చేశాడు. సోషల్ మీడియాలో పెద్దగా యాక్టివ్ గా ఉండని మిస్టర్ కూల్ ఫేస్ బుక్ లో 3 వాక్యాలను పోస్ట్ చేశాడు. ' విశ్రాంతి తీసుకోవడానికి ఇది సరైన సమయం. ముఖ్యమైన పనులు చేయడానికి ఇది అనువైన సమయం. నేను నా సొంత జట్టును ప్రారంభిస్తున్నాను!' అని ధోని రాసుకొచ్చాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ధోని ఏ ఉద్దేశంతో ఈ పోస్ట్ ను షేర్ చేశాడు? ఇప్పుడు ధోనీ కొత్త జట్టు ఏది? ఆ జట్టు క్రికెట్‌కు సంబంధించినదా లేక మరేదైనా ఉందా? దీనిపై క్రికెట్ అభిమానులు, ధోనీ అనుచరులు తలలు పట్టుకుంటున్నారు. గతంలో ధోనీ తీసుకున్న పలు నిర్ణయాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. అనూహ్యంగా రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నాడు. అలాగే ధోని సోషల్ మీడియా పోస్ట్‌లలో దేనినైనా అలాగే అంచనా వేయడం తప్పు, ఎందుకంటే ధోనీ కూడా అలాంటి పోస్ట్‌ల ద్వారా ప్రమోషన్లు చేస్తున్నాడు. ధోనీ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో తన సొంత జట్టును ప్రారంభిస్తున్నట్లు తెలిపాడు. అయితే ఈ జట్టు క్రికెట్‌కు సంబంధించినదా? లేదా ధోని %ఖూా%లో జట్టును తీసుకోబోతున్నాడా? అనే చర్చ జరుగుతోంది. మరోవైపు ధోనీ ఇంకేమైనా స్టార్ట్ చేసి తన టీమ్‌ని అక్కడికి తీసుకురావాలనుకుంటున్నాడా? అనే టాక్ కూడా ఉంది. ఇప్పుడు ధోనీ కొత్త జట్టు ఏది? అతను ధోనీ జట్టుకు కెప్టెన్ అవుతాడా లేక మరెవరైనా ఉంటారా? అంటూ అభిమానులు లెక్కలేసుకుంటునన్నారు . అయితే ధోని షేర్ చేసిన ఈ పోస్ట్‌కు అర్థం రానున్న రోజుల్లో తేలిపోతుందని అభిమానులు భావిస్తున్నారు. అందుకే అందరూ ధోని సోషల్ మీడియా అకౌంట్లపై ఓ కన్నేసి ఉంచుతున్నారు. కాగా, ఐపీఎల్ 17వ సీజన్‌కు ముందు మహేంద్ర సింగ్ ధోనీ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుని రుతురాజ్ గైక్వాడ్‌కు పగ్గాలు అందించాడు. రీతురాజ్ నాయకత్వంలో చెన్నై 14 మ్యాచ్‌లకు గాను 7 గెలిచింది. మరో 7 మ్యాచుల్లో పరాజయం పాలై ప్లే ఆఫ్స్ కు చేరకుండానే నిష్క్రమించింది.

## విరాట్ కోహ్లీ భద్రతకు ముప్పు..




హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:
ఎలిమినేటర్ మ్యాచ్ ఈరోజు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరగనుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియం వేదికగా రాత్రి 7.30 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. ఈ హై ఓల్టేజ్ మ్యాచ్ కోసం లక్షలాది మంది క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ భద్రతకు పెను ముప్పు ఉందన్న అభిమానులను అందోళనకు గురి చేస్తున్నాయి. కోహ్లీ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎలిమినేటర్ మ్యాచ్‌కు ముందు %=జదీ% ప్రాక్టీస్‌ను కూడా రద్దు చేసింది. విలేకరుల సమావేశం కూడా నిర్వహించలేదు. కీలకమైన మ్యాచ్‌కు ముందు ఫ్రాంచైజీ తీసుకున్న ఈ నిర్ణయం ర్య %=జదీ% అభిమానులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఆర్‌సీబీ, రాజస్థాన్‌ల మధ్య మ్యాచ్ కోసం ఇరు జట్లు సోమవారం అహ్మదాబాద్ చేరుకున్నాయి. గత శనివారం చెన్నైతో %=జదీ% తన చివరి లీగ్ మ్యాచ్ ఆడింది. ఆ తర్వాత ఆది, సోమవారాల్లో జట్టుకు విశ్రాంతి లభించింది. అయినప్పటికీ, అహ్మదాబాద్ చేరుకున్న తర్వాత, %=జదీ% ఎలిమినేటర్ మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సెషన్‌ను రద్దు చేసింది. బెంగాలీ దినపత్రిక ఆనంద్‌బజార్ వార్తాపత్రిక గుజరాత్ పోలీసు అధికారులను ఉటంకిస్తూ విరాట్ కోహ్లీ భద్రత కారణంగా %=జదీ% తన ప్రాక్టీస్‌ను రద్దు చేసిందని, ఇరు జట్లు విలేకరుల సమావేశం నిర్వహించలేదని పేర్కొంది. ఎలిమినేటర్ మ్యాచ్‌కు ముందు అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి ఉగ్రవాదుల కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే అనుమానంతో నలుగురు సాయుధ వ్యక్తులను గుజరాత్ పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. నలుగురు నిందితుల గురించి సమాచారం అందుకున్న పోలీసులు వారి నుంచి ఆయుధాలు, అనుమానాస్పద వీడియోలు, మెసేజ్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎలిమినేటర్ మ్యాచ్‌కు ముందు నలుగురు ఉగ్రవాదులను అరెస్టు చేయడంతో %=జదీ% టెన్షన్‌లో ఉంది. దీని కారణంగా విరాట్ కోహ్లీ భద్రతను దృష్టిలో ఉంచుకుని %=జదీ% ప్రాక్టీస్‌ను రద్దు చేసింది. అయితే ఈ ఘటన తర్వాత కూడా రాజస్థాన్ జట్టు మైదానంలో ప్రాక్టీస్ చేసింది. మరోవైపు ఇరు జట్లు మీడియా సమావేశాన్ని రద్దు చేసుకున్నాయి. ప్రాక్టీస్ సెషన్‌ను ఎందుకు రద్దు చేశారనే దానిపై %=జదీ% ఫ్రాంచైజీ నుండి అధికారిక ప్రకటన లేనప్పటికీ, విరాట్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రాక్టీస్‌ను రద్దు చేసినట్లు తెలుస్తోంది.

## ఆర్‌సీబీదే ఏకపక్ష విజయం: సునీల్ గవాస్కర్

హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:
ఐపీఎల్ 2024 సీజన్‌లో మరో రసవత్తరపోరుకు రంగం సిద్దమైంది. మరికాసేపట్లో ప్రారంభమయ్యే ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ), రాజస్థాన్ రాయల్స్(ఆర్ఆర్) అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు టోర్నీలో ముందడుగు వేయనుండటంతో ఇరు జట్లు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాయి. ఈ ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టు శుక్రవారం చెన్నై వేదికగా జరిగే క్వాలిఫయర్-2లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. సంచలన ప్రదర్శనతో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించిన ఆర్‌సీబీ.. అదే జోరులో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించి టోర్నీలో ముందడుగు వేయాలనుకుంటోంది. ఈ టోర్నీ ఫస్టాఫ్ సీజన్‌లో 8 మ్యాచ్‌లకు ఒకే ఒక్క విజయం సాధించిన ఆర్‌సీబీ.. ఆ తర్వాత వరుసగా 6 విజయాలతో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. పటిష్టమైన చెన్నై సూపర్ కింగ్స్‌ను మట్టికరిపించింది. రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఎలిమినేటర్ మ్యాచ్‌కు సిద్ధమైంది. మరోవైపు రాజస్థాన్ రాయల్స్.. టోర్నీ ఆరంభంలో అసాధారణ ప్రదర్శన కనబర్చింది. టేబుల్ టాపర్‌గా కొనసాగింది. కానీ చివరి ఐదు మ్యాచ్‌ల్లో అనూహ్యంగా వరుసగా నాలుగింటిలో ఓడిన రాజస్థాన్ రాయల్స్ ఒక్కసారిగా ఢీలా పడింది. కేకేఆర్‌తో జరగాల్సిన చివరి మ్యాచ్ వర్షం కారణంగా రద్దవ్వడంతో పాయింట్స్ టేబుల్‌లో రెండో స్థానాన్ని అందుకోలేకపోయింది. పేపర్‌పై రాజస్థాన్ రాయల్స్ బలంగా కనిపిస్తున్నా.. ఫామ్ పరంగా ఆర్‌సీబీ భీకరంగా కనిపిస్తోంది. అయితే ఈ ఎలిమినేటర్ మ్యాచ్ కూడా క్వాలిఫయర్-1లా ఏక పక్షంగా సాగే అవకాశం ఉందని దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ అన్నాడు. రాజస్థాన్ రాయల్స్‌ను ఆర్‌సీబీ చిత్తుగా ఓడిస్తుందని జోస్యం చెప్పాడు. అసాధారణ ప్రదర్శనతో ప్లే ఆఫ్స్ చేరిన ఆర్‌సీబీ ముందు రాజస్థాన్ రాయల్స్ తేలిపోతుందన్నాడు. 'ఓవైపు రాజస్థాన్ రాయల్స్ తమ చివరి మ్యాచ్‌ల్లో నాలుగు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. తమ చివరి మ్యాచ్‌ల్లో ఆ జట్టు గొప్ప ప్రదర్శన చేయలేదు. చివరి మ్యాచ్ వర్షంతో రద్దవ్వడంతో ఆ జట్టుకు ప్రాక్టీస్ లేకుండా పోయింది. ఆ జట్టు విజయం సాధించాలంటే కేకేఆర్ తరహా ప్రత్యేకమైన ప్రదర్శన చేయాలి. ఈ మ్యాచ్ కూడా ఏకపక్షంగా ముగిసే అవకాశం ఉంది. నా భయం కూడా ఇదే. భీకర ఫామ్‌లో ఉన్న ఆర్‌సీబీ చేతిలో రాజస్థాన్ చిత్తుగా ఓటమిపాలవుతుందని అనిపిస్తోంది.'అని సునీల్ గవాస్కర్ చెప్పుకొచ్చాడు.

# దేవర చిత్రంలో అవకాశం ఓ అదృష్టం






**పాత్ర గురించి వివరించిన జాన్వీ కపూర్**

హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ డ్రామా ఫిల్మ్ 'దేవర' చిత్రంతో బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' ప్రమోషన్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో 'దేవర'లో పాత్ర గురించి మాట్లాడారు. 'ఇందులో 'తంగం' పాత్ర పోషిస్తున్నాను. అది ఎంతో వినోదాత్మకంగా ఉంటుంది. ఇప్పటి వరకు చేసిన షూటింగ్ చాలా సరదాగా జరిగింది. సెట్‌లోని వారంతా నాపై ఎంతో ప్రేమగా ఉంటారు. చిత్రయూనిట్ అంకితభావానికి ఆశ్చర్యపోయాను. ఇది విభిన్నమైన కథ. అందంగా, ప్రత్యేకంగా ఉంటుంది. 'దేవర'లో అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఇంత మంచి చిత్రంలో నటించే అవకాశమిచ్చిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు' అని చెప్పారు. తాజాగా ఈ సినిమాలో తొలి పాటను విడుదల చేయగా దానికి మంచి ప్రేక్షకాదరణ లభించింది. త్వరలోనే రెండో పాట విడుదల చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. సముద్రతీరం నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామా ఇది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోంది. ఓ సందర్భంలో దర్శకుడు ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఎన్టీఆర్, ఆయన అభిమానులకు 'దేవర' ప్రత్యేకంగా నిలుస్తుందని చెప్పడంతో దీనిపై అంచనాలు రెట్టింపయ్యాయి. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తోన్న ఈ చిత్రంలో శ్రీకాంత్ కీలకపాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్ర మొదటి భాగాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించారు. అయితే కొన్ని కారణాల వల్ల దీని విడుదలను అక్టోబర్ 10కి వాయిదా వేశారు.

## రొటీన్‌కు భిన్నంగా శ్రీవిష్ణు ..స్వాగ్




హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:

రొటీన్ సినిమాలకు భిన్నంగా తనకంటూ డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ విజయాలను అందుకుంటున్నాడు టాలీవుడ్ హీరో శ్రీ విష్ణు. ఈ హీరో ప్రస్తుతం స్వాగ్ అనే సినిమాతో వస్తున్న విషయం తెలిసిందే. బోరింగ్ కథలకు టాటా చెబుతూ! సరికొత్త పంథాలో అచ్చ తెలుగు సినిమా అంటూ ఇప్పటికే గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి మరో అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మూవీ నుంచి ఎగ్జైటింగ్ అప్‌డేట్‌లు త్వరలోనే ఇవ్వబోతున్నట్లు చిత్రబృందం ఎక్స్ వేదికగా ప్రకటించింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహారిస్తుండగా.. ఈ సినిమాకు హసిత్ గోలి దర్శకత్వం వహించబోతున్నాడు. వివేక్ సాగర్ సంగీతం అందిస్తుండగా.. వేద రామన్ శంకరన్ సినిమాటోగ్రఫర్ గా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో పెళ్లి చూపులు ఫేమ్ రీతూ వర్మ కథానాయికగా నటిస్తుంది. జూలై మొదటి వారంలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

## తమిళ కమిడియన్ సూరి మూవీ ట్రైలర్ విడుదల

హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:

గతేడాది వచ్చిన విడుతలై పార్ట్-1 సినిమాతో హీరోగా మంచి గుర్తింపు సంపాదించాడు తమిళ స్టార్ కమెడియన్ సూరి . కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో సూరి నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు కూడా వచ్చాయి. కాగా ఈ మూవీ తర్వాత సూరి వరుస మూవీలను లైన్‌లో పెడుతున్నాడు. ఇప్పటికే విడుతలై పార్ట్-2 లో నటిస్తున్న సూరి తాజాగా మరో కొత్త సినిమాను విడుదలకు రెడీ చేశాడు. సూరి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం గరుడన్. ఈ సినిమాకు కాకీ స్టైై , కోడి,పట్టాస్ చిత్రాల ఫేమ్ దురై సెంథిల్‌కుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. తమిళ నటుడు శశికుమార్, మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రేవతి శర్మ, శివత నాయర్ , బ్రిగుడ సాగ కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మూవీ నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు.ఇక ఈ ట్రైలర్ గమనిస్తే.. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తుంది. సూరి కూడా ఇప్పటివరకు ఎన్నడూ చూడని మాస్ అవతర్ లో కనిపిస్తున్నాడు.ఇక ఈ చిత్రాన్ని లార్క్ స్టూడియోస్ గ్రాస్ రూట్ ఫిల్మ్ కంపెనీసంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సముద్రఖని, మొ÷-టట్టై రాజేంద్రన్, మైమ్ గోపి తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఆర్థర్ ఎ విల్సన్ సినిమాటోగ్రఫీ చేయనుండగా.. ప్రదీప్ ఇ రాఘవ్ ఎడిటింగ్ నిర్వహించనున్నారు. కాగా ఈ చిత్రానికి వెట్రి మారన్ కథను అందిస్తుండగా.. యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు.



# ఆరోగ్యశ్రీ కింద రూ.203 కోట్లు విడుదల

**నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఇక చెల్లింపులు**

**ఆరోగ్యశ్రీ ట్రస్ట్ వెల్లడి**

అమరావతి,మే22అక్షరం న్యూస్:

నెట్‌వర్క్ ఆసుపత్రులకు నిధులు విడుదల చేసినట్టు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ వెల్లడించింది. ప్రస్తుతం రూ.203 కోట్లు విడుదల చేశామని, పెండింగ్ బకాయిలు త్వరలో విడుదల చేస్తామని తెలిపింది. ఆరోగ్యశ్రీ సేవలకు చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించామని ట్రస్ట్ వెల్లడించింది. పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు, ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ ప్రతినిధుల మధ్య మంగళవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో బుధవారం నుంచి తమ అసోసియేషన్‌లో సభ్యత్వం కలిగిన ఆసుపత్రుల్లో రోగులకు చికిత్స అందించడాన్ని నిలిపివేయనున్నట్లు ఆశా స్పష్టం చేసింది. గత ఆగస్టు నుంచి బకాయిపడిన రూ.1,500 కోట్ల బిల్లులను వెంటనే చెల్లించకుంటే ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని ఆశా ప్రకటించిన నేపథ్యంలో అసోసియేషన్ ప్రతినిధులతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ లక్ష్మీశా మంగళవారం రాత్రి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల కోసం చర్యలు తీసుకుంటుందని సీఈఓ చెప్పారు. గతంలోనూ ఇలాగే చెప్పినప్పటికీ బిల్లుల చెల్లింపులు జరగలేదని ప్రతినిధులు పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపులకు నిర్దిష్టమైన చర్యలు కనిపించనందున బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల ఆరోగ్య బీమా కింద కొత్త కేసులను తీసుకునేది లేదని ఆశా యాక్టింగ్ ప్రెసిడెంట్ వై.రమేష్, ప్రధాన కార్యదర్శి సి.అవినాష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో దిగొచ్చిన ప్రభుత్వం తాత్కాలికంగా రూ.203 కోట్లు విడుదల చేసింది.

## చీరకట్టులో జాన్వీ అదుర్స్



హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ స్టన్నింగ్ లుక్‌లో దర్శనమిచ్చారు. కంచి పట్టు చీర కట్టిన ఆ ముద్దుగుమ్మ.. తన అందాలతో ఆకర్షిస్తోంది. బ్లూ కలర్ శారీ కట్టుకున్న జాన్వీ.. ఆ పట్టు చీరపై క్రికెట్ డిజైన్ వేసుకున్నది. మిస్టర్ అండ్ మిస్సెస్ మహీ ఫిల్మ్ కోసం వారణాసిలో ప్రమోషన్ చేస్తున్న ధడక్ గర్ల్.. చాలా వెరైటీ శారీలో తళుక్కుమన్నది. గంగా నది తీరంలో పడవపై వెళ్తూ ఆమె తన చీరలో దాగిన డిజైన్ వర్క్‌ను ప్రజెంట్ చేసింది. బ్లూ కలర్ చీరపై చేయితో నేసిన డిజైన్ వర్క్ ఆకట్టుకంటోంది. 1983 వరల్డ్ కప్ గెలిచిన సందర్భానికి చెందిన క్షణాలను ఆ చీరపై అత్యంత కళాత్మకంగా డిజైన్ చేశారు. మిరుమిట్లు గొలిపే స్టేడియంలో ఓ బ్యాటర్ భారీ సిక్స్ కొట్టినట్లు ఆ చీర డిజైన్‌లో చూపించారు. క్రికెటర్లు పవర్‌ఫుల్ షాట్లు ఆడుతున్నట్లు కూడా డిజైన్‌లో క్రియేట్ చేశారు. షార్ట్ స్లీవ్ బ్లౌజ్ వేసుకున్న జాన్వీ.. బ్యాక్‌లెస్ టై నాట్‌తో సంప్రదాయబద్ధంగా కనిపించింది. క్రికెట్ స్టోరీ నేపథ్యం ఉన్న చిత్రంలో నటిస్తున జాన్వీ.. ఆ కాన్సెప్ట్‌తో డిజైన్ చేసిన చీరలో తన ఫ్యాషన్ ట్యాలెంట్‌ను ప్రదర్శించింది.

## అనుష్కతో సినిమా తీస్తా: నిర్మాత బషీద్



హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:

అనుష్క ప్రధాన పాత్రల్లో ఓ సినిమాకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాత ఎస్ కే బషీద్ తెలిపారు. 2007లో అల్లరి నరేష్, వేణు హీరోలుగా 'అల్లరే అల్లరి' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో నిర్మాతగా తన ప్రస్థానం మొదలుపెట్టిన ఎస్ కే బషీద్.. ఆ తర్వాత పలు చిత్రాలను నిర్మించారు. తన కొత్త సినిమా విశేషాలను తాజాగా హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన చెప్పుకొచ్చారు. అల్లరే అల్లరి సినిమాతో నిర్మాతగా చిత్ర పరిశ్రమకు వచ్చాను. వ్యాపారవేత్తగా, నిర్మాతగా కొనసాగుతున్నాను. దర్శకుడు సురేష్ కృష్ణ దర్శకత్వంలో విజయేంద్రప్రసాద్ కథతో అనుష్క, విజయశాంతి ప్రధాన పాత్రల్లో ఓ సినిమాకు సన్నాహాలు చేసుకుంటున్నాను. ఇంకా వారితో నేరుగా సంప్రదింపులు జరపలేదు. డిస్కషన్స్ చేయబోతున్నాం. ఈ మూవీకి ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తారు. ఒక పాట కంపోజిషన్ జరుగుతోంది. ఆ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే తెలియజేస్తానన్నారు.

## ఓటిటిలోకి అజయ్ దేవగణ్ ..మైదాన్




హైదరాబాద్,మే22(అక్షరం న్యూస్:

బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం మైదాన్ . ఇండియన్ లెజెండరీ ఫుట్‌బాల్ కోచ్ అబ్దుల్ రహీమ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమాకు అమిత్ రవీంద్రనాథ్ శర్మ దర్శకత్వం వహించాడు.. జీ స్టూడియోస్ సంస్థ, బోనికపూర్ నిర్మాతలుగా వ్యవహరించారు. ఈ సినిమా అనుకోని కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తూ.. ఎట్టకేలకు ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద యావరేజ్‌గా నిలిచింది. ఇప్పుడు తాజాగా ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో ఈ సినిమా ప్రస్తుతం రెంటల్ విధానంలో అందుబాటులోకి వచ్చింది. రూ.349కి ఈ సినిమాను ప్రైమ్ అందుబాటులో ఉంచింది. 1950-62 మధ్యకాలంలో ఫుట్‌బాల్ ఆటకు ఇండియాలో విపరీతమైన క్రేజ్ ఉండేది. అయితే ఫుట్‌బాల్ ఆటకు ఇంత ఆదరణ రావడానికి కారణం ఫుట్‌బాల్ కోచ్ అబ్దుల్ రహీమ. అతను కోచ్‌గా ఉన్నప్పుడే 1951, 1962లో భారత ఫుట్ బాల్ టీమ్ ఆసియా గేమ్స్ లో విజయం సాధించింది. ఇక అబ్దుల్ రహీమ్ కోచ్‌గా ఉన్నప్పుడు జరిగిన సంఘటనల ఆధారంగా ఈ సినిమా రాగా.. అబ్దుల్ రహీమ్ పాత్రలో అజయ్ దేవగణ్ నటించగా.. అతడి భార్య పాత్రలో ప్రియమణి నటించింది. ఇక ఈ సినిమాలో గజ్రాజ్ రావ్. రుద్రానిల్ ఘోష్ కీలక పాత్రలు పోషించారు.

## బోల్తాపడ్డ మద్యం బాటిళ్ల లారీ

**బాటిళ్లు తీసుకెళ్లే ప్రయత్నాలకు పోలీసుల బ్రేక్**

హైదరాబాద్,మే22((అక్షరం న్యూస్:

మద్యం బాటిళ్లతో వెళుతోన్న లారీ హైదరాబాద్ బోయిన్ పల్లి వద్ద బోల్తా పడింది. మద్యం బాటిళ్లు చెల్లాచెదురుగా అక్కడ పడిపోయాయి. వాటిని చూసిన కొందరు తీసుకెళ్లేందుకు గుమికూడారు. లారీ బోల్తా పడిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకోవడంతో వారి ప్రయత్నం ఫలించలేదు. లారీ డ్రైవర్, క్లీనర్, వైన్ షాప్ సిబ్బంది కూడా వచ్చారు. మరో వ్యాన్‌లో లిక్కర్ బాటిళ్లను తరలించారు. పోలీసులు బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంతో బాటిళ్లు తీసుకెళ్లడం వీలు పడలేదు. లేదంటే ఆ మందు బాటిళ్లు మొత్తం మాయం చేసేవారు. ఆ లారీ బోల్తాకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ చక్కర్లు కొడుతున్నాయి.

## తూకం వేసిన ధాన్యాన్ని త్వరితగతిన సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలి

**- అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్**
**నంది మేడారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్**



**పెద్దపల్లి ప్రతినిధి మే - 22: అక్షరం న్యూస్:** ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని తీసుకుని రావాలని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ పేర్కొన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ ధర్మవరం మండలంలోని నంది మేడారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ ధాన్యం కొనుగోలు కేంద్రలో ఉన్న రైతులతో మాట్లాడి, ధాన్యం కొనుగోలు వివరాలు తనిఖీ చేశారు.
ప్రస్తుతం అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం వేసినధాన్యాన్ని వెంటనే నమోదు చేసి,సంబంధిత మిల్లులకు తరలించాలని ధర్మారం మండలంలోని సెంటర్ ఇన్చార్జి లను ఆదేశించారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం కోత లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.
ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్లు, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యావంతుడు అయినబీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించండి

**- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



మహబూబాబాద్ /గార్ల /మే 22/అక్షరం న్యూస్..కాంగ్రెస్ మోసపూరిత మాటలు విని ఇప్పటికే ప్రజలు మోసపోయారు,కానీ రానున్న గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విజ్ఞప్తి చేశారు.మహబూబాబాద్ జిల్లా, తొర్రురు మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ,ఈ ఎన్నికలు ఒక బ్లాక్ మెయిలర్ కి, ఒక విద్యావంతుడికి మధ్య జరుగుతున్న పోటీ అని అన్నారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని తాను ఒక ప్రశ్నించే గొంతుక అని చెప్పి ప్రజల్లోకి వెళ్లిన వ్యక్తి అదే సోషల్ మీడియాని అడ్డం పెట్టుకొని జోరుగా బ్లాక్ మెయిల్ దందాలు చేస్తున్నాడని అన్నారు, నేడు అదే సోషల్ మీడియా వేదిక గా తాను చేసినటువంటి అక్రమాలు బ్లాక్మెయిల్ దందాలు అన్ని ఒక్కొక్కటిగా బయటకు వస్తున్న తీరు మనం చూస్తూనే ఉన్నాం, కాబట్టి ఇలాంటి వ్యక్తులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ప్రతి ఒక పట్టభద్రులకు ఉందని అన్నారు. అద్భుతమైన వాగ్దాటి పోరాటపటిమ,ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం కలిగిన రాకేష్ రెడ్డి ని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని అన్నారు. ఈ సమావేశంలో, పాలకుర్తి నియోజకవర్గం పట్టభద్రుల ఎన్నికల ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మండల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


## ఈనెల 25న జిల్లా పరిషత్తు సర్వ సభ్య సమావేశం

**- జిల్లా పరిషత్ సి.ఈ.ఓ దేవసహాయం**



**నాగర్ కర్నూల్ మే 22(అక్షరం న్యూస్):** నాగర్ కర్నూల్ జిల్లా ప్రజాపరిషత్తు సర్వ సభ్య సమావేశం ఈనెల 25న జిల్లా కేంద్రంలోని యస్ జె ఆర్ ఫంక్షన్ హాల్ లో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ అధ్యక్షతన జిల్లా సర్వసభ్య సమావేశం ఈనెల ఉదయం 11:00 గంటలకు నిర్వహించనున్నట్లు నాగర్ కర్నూల్ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దేవ సహాయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనుల పూర్తి సమగ్ర సమాచారంతో సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

## ఈనెల 30న జిల్లా ఆస్పత్రిలో ఉచిత కంటి చికిత్స శిబిరం



**నాగర్ కర్నూల్ మే 22 (అక్షరం న్యూస్):** జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో ఈనెల 30 న ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఆప్తాలమిక్ అదికారి బి. శివారెడ్డి తెలిపారు. క్యాటరాక్ట్ కంటి పొర గల వారికి . దృష్టి లోపం గల వారికి ఈ శిబిరంలో ప్రత్యేకంగా కంటి పరీక్షలు నిర్వహించి అందులో అవసరమైన వారిని,ప్రత్యేక అంబులెన్స్ ద్వారా మహబూబ్ నగర్ ఏనుగొండలోని లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రికి ఆపరేషన్ నిమిత్తం పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరానికి వచ్చేవారు బి.పి ,షుగర్ రక్త పరీక్ష, కరోనా పరీక్ష,ఒక రోజు ముందుగానే చేయించుకోవాలని, రోగులు తమవెంట ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీ,సెల్ నెంబర్ తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440454284 నెంబర్ లో సంప్రదించాలని తెలిపారు.

# సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలి

**- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్**



**భద్రాద్రి కొత్తగూడెం /భద్రాచలం /మే 22/ అక్షరం న్యూస్ :** మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలలోని గిరిజన కుటుంబాలు వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి రోగాలు దరి చేరవని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.
గిరిజన కుటుంబాలు ప్రతిరోజు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగవలెనని, ప్రభుత్వం వారు సరఫరా చేయు మంచినీరు పైపులు ఎలాంటి లీకులు లేకుండా జాగ్రత్త వహించవలని, గ్రామపంచాయతీ మరియు పట్టణ ప్రాంతాల్లో వాటర్ ట్యాంక్స్ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకొని, ట్యాంకులపై మూత పెట్టి ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీ వారికి తెలియజేయలని ఆయన అన్నారు.
వర్షాకాలం వర్షపు నీరు మంచినీటిలో కలిసి జంతు కళేబరాలు, చెత్తాచెదారం కలవడం ద్వారా మంచినీరు కలిషితం అయ్యే అవకాశం ఉంది. కనుక తప్పనిసరిగా క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలని, పిల్లలు, పెద్దలు భోజనానికి ముందు మరుగుదొడ్డికి వెళ్లి వచ్చాక చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, పట్టణాలలో, గ్రామాలలో ఆరుబయట రోడ్డుపై తయారు చేయు తినుబండరాలు ఇతర పదార్థాలు ఇష్టం వచ్చినట్లు తినకూడదని, కూరగాయలు, ఆకుకూరలు శుభ్రంగా కడిగిన తర్వాత మాత్రమే కోసుకొని తినాలని, చిన్నపిల్లలు ఆరు బయట తిరుగునప్పుడు తప్పనిసరిగా చెప్పులు వేసుకోవాలని,లేనిచో మట్టిలో ఉన్న చిన్న క్రీములు, నులిపురుగులు ఏలిక పాములు కాళ్ల ద్వారా మరియు చేతుల ద్వారా పిల్లలకు కడుపులోకి వెళ్లి నులి పురుగులు తయారై పిల్లలు తినే ఆహారాన్ని జీర్ణం కాకుండా చేస్తాయని, తద్వారా రక్తహీనత తగ్గి అనారోగ్యానికి గురి అయ్యే అవకాశం ఉందని, అందుచేత గిరిజన ప్రాంత గిరిజన కుటుంబాలు ఈ యొక్క జాగ్రత్తలు పాటించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఎవరైనా అనారోగ్యానికి గురి అయితే తప్పనిసరిగా దగ్గర్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని, డాక్టర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఇచ్చే సలహాలు సూచనలు తప్పకుండా పాటించాలని ఆయన కోరారు.

# అవినీతి ప్రభుత్వానికి గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు చెంపపెట్టు




**- ఇరిగేషన్ మైనింగ్ శాఖకు రూ.50కోట్ల జరిమానా**
**- అవినీతిపరులకు వంతపాడిన అధికారులను వదలం,**
**- ఎన్జిటి తీర్పుని స్వాగతిస్తున్నాం**
**- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి**

**పెద్దపల్లి టౌన్ మే 22 అక్షరం న్యూస్ :** అధికారమధంతో మానేరువాగు నుండి ఇసుక అక్రమ ఇసుక తవ్వకాలు జరిపి రూ.వేలకోట్లు దోచుకున్న గత అధికార ప్రతిపక్ష నాయకులకు చెన్నయ్ హరిత ట్రిబ్యూనల్ న్యాయస్థానం వెలువరించిన తీర్పు చెంపపెట్టులాంటిదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు జిల్లా స్థాయి ఇసుక మానిటరింగ్ కమిటీకి వ్యతిరేఖంగా హరిత న్యాయస్థానం తీర్పు వెలువరించిన నేపధ్యంలో బుధవారం సురేష్ రెడ్డి ఆయన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు పర్యావరణ శాఖ అనుమతులు లేకుండా మానేరువాగు వెంబడి 19ఇసుక రీచులకు సంబంధిత అధికారులు అనుమతులు ఇవ్వడాన్ని న్యాయస్థానం తప్పుపట్టినట్లు పేర్కొన్నారు.
అంతేకాకుండా అధికార పార్టీ, ప్రతిపక్ష నాయకులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అక్రమ తవ్వకాలు జరపడం పట్ల కోర్టు ఆగ్రహించిందని వివరించారు. అవినీతికి బాద్యులను చేస్తూ ఇరిగేషన్, మైనింగ్ శాఖలుకు రూ.50కోట్ల జరిమానా విధించినదని, అట్టి డబ్బులను మూడునెలల్లో గోదావరి రివర్ మేనేజిమెంటు ఖాతాలో జమచేయాల్సిందిగా న్యాయస్థానం తీర్పు వెలువరించిదన్నారు చేతివృత్తులు చేసుకునే వారికి మాత్రమే పర్యావరణ శాఖ నుండి అనుమతులు అవసరముండదనే విషయాన్ని కోర్టు స్పష్టంగా తెలియపరిచిందని సురేష్ రెడ్డి అన్నారు. జిల్లాలో అన్ని రీచులను వెంటనే మూసివేయాలని, అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా అధికారులను కోరారు. గత ప్రభుత్వం చేసిన ఇసుక మాఫియాలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులకు కూడా వాటా ఉందని, అవినీతిపరులకు అండగా ఉన్న అధికారులను వదిలిపెట్టబోమని సురేష్ రెడ్డి వ్యాఖ్యానించారు. మూడేళ్ళుగా ప్రాణాలకు తెగించి తాము చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలిచిన రైతులు, ప్రజలు, అభిమానులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు మాజీ సర్పంచ్ కట్కూరి సత్యనారాయణ రెడ్డి పార్లమెంట్ దళిత మోర్చా కోకన్వీనర్ ఈర్ల శంకర్ అమరగాని శ్రీనివాస్ యాదవ్ కందుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల కష్టాలు తెలుసుకునేందుకే “ఆది” దుబాయ్ వెళ్లారు..

**- బి.సి బిడ్డలు విదేశాలకు వెళ్తే బి.ఆర్.ఎస్ నాయకులు ఓర్వడం లేదు.**
**- రైతులపై, రైతుల కష్టాలపై పూర్తి అవగాహన కలిగిన పార్టీ కాంగ్రెస్.**
**- రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బి.ఆర్.ఎస్ నాయకులకు లేదు.**
**- మా నాయకులు ఎక్కడ ఉన్నా వారి ధ్యాస, శ్వాస నియోజకవర్గ ప్రజలపైనే ఉంటుంది.**
**- నిజంగా నియోజకవర్గ ప్రజల కష్టాలను గాలికి వదిలేసిన పార్టీ బి.ఆర్.ఎస్ కదా....?**
**- తమ నాయకులపై బి.ఆర్.ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం.**
**- అర్థంపర్థం లేని వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి.**
**- డీసీసీ ఉపాధ్యక్షులు సంగ స్వామి యాదవ్ డిమాండ్.**



**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, మే - 22 (అక్షరం న్యూస్):** ఎడారి దేశంలో గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలు, వారి స్థితిగతులను తెలుసుకునేందకు, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపులో భాగస్వామ్యమైన గల్ఫ్ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపెందుకే తమ నాయకులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దుబాయ్ వెళ్ళారని డీసీసీ ఉపాధ్యక్షులు సంగ స్వామి యాదవ్ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బి.ఆర్.ఎస్ నాయకుల ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బి.సి బిడ్డలైన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు విదేశాలకు వెళ్తే బి.ఆర్.ఎస్ నాయకులు ఓర్వడం లేదని మండిపడ్డారు. తమ నాయకులు ఎక్కడ ఉన్నా వారి ధ్యాస, శ్వాస నియోజకవర్గాలపైనే ఉంటుందని, నియోజకవర్గాలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అటు అధికారులను, ఇటు పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ ఎల్లప్పుడూ నియోజకవర్గ బాగోగులను పర్యవేక్షిస్తున్నారని గుర్తు చేశారు. మొన్నటికి మొన్న శాత్రజ్ పల్లిలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన శ్రీనివాస్ కుటుంబంతో పాటు తదుపరి రోజు వెంకట్రావుపేట గ్రామంలో ఉపాధిహామీ పనుల్లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబానికి అండగా నిలవాలని, ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అటు అధికారులను, ఇటు పార్టీ శ్రేణులను ఆదేశించిన గొప్ప నాయకులు ఆది శ్రీనివాస్ అని, అలాంటి వ్యక్తిని పట్టుకొని పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో తిరగలేక మొఖం చాటేసుకొని ఉన్న చల్మెడ లక్ష్మీ నరసింహా రావు విమర్శించడం సిగ్గుచేటని, తమ నాయకులను విమర్శించే హక్కు ఆయనకు గాని, వారి నాయకులకు లేదని, గత పదేండ్లతో పాటు, అసెంబ్లీ ఎన్నికల తరువాత నియోజకవర్గానికి దూరంగా ఉంటూ అమావాస్య, పౌర్ణమికి వచ్చి పోతున్న వారు ఎవరో ప్రజలందరికీ తెలుసునని, అలాంటి ప్యారచుట్ నాయకులది తమ నాయకులను విమర్శించే స్థాయి కాదని, నిజంగా నియోజకవర్గాన్ని గాలికి వదిలేసింది ఎవరో అందరికి తెలుసునని అన్నారు. రైతులపై, రైతుల కష్టాలపై పూర్తి అవగాహన కలిగిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, గత పదేండ్లలో ఏనాడు రైతు రుణమాఫీ చేయలేని బి.ఆర్.ఎస్ పార్టీ రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రుణమాఫీ చేస్తే, ఆయన స్ఫూర్తితో నేడు ప్రజాపాలనలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రుణమాఫీ చేసేందుకు సిద్ధంగా ఉందని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమం కొరకు పరితపించే తమ నాయకులపై బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు చేసిన అర్థంపర్థం లేని వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటాంపల్లి మాజీ సర్పంచ్ బండ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ బాలరాజ్ పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు నాగుల నర్సయ్య, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, అంబాటి చందు తదితరులు పాల్గొన్నారు.



# మద్యం దుకాణాల తనిఖీ

**పెద్దపల్లి/ కమాన్పూర్/ మే22/ అక్షరం న్యూస్:** మండలంలోని గుండారం క్రాస్ రోడ్డు లో గల మద్యం దుకాణం తో పాటు మండల కేంద్రంలోని మరో మద్యం దుకాణంను పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ ల ఆధ్వర్యంలో సంయుక్తంగా బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. వైన్స్ షాప్లకు అనుమతులతో పాటు పర్మిట్ రూమ్ అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాలు ఆరా తీశారు. ఈ తనిఖీల్లో కమాన్ పూర్ ఎస్ఐ చంద్రశేఖర్, అబ్కారి ఎస్ఐ సాయి కుమార్ లు తనిఖీలు నిర్వహించారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

**పెద్దపల్లి/ కమాన్పూర్/ మే22/ అక్షరం న్యూస్:** మండలం పరిధిలో గల విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మండల బీఆర్ఎస్ నాయకులు ట్రాన్స్ కో ఏఈ రాజేంద్రకుమార్ కు బుధవారం వినతి పత్రం అందజేశారు. గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు సంబంధించిన విద్యుత్ సరఫరాలో విద్యుత్ అంతరాయంతో పాటు, రైతులు పంట పొలాల వద్ద ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు కోసం డీడీలు కట్టినప్పటికి పనుల్లో జాప్యం జరుగుతోందని, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అర్హులైన వారిలో కొంతమందికి మాత్రమే వస్తుందని, గ్రామాల్లో విద్యుత్ లూప్ వైర్లతో పాటు తదితర సమస్యలను పరిష్కరించే దిశగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, ఇంకా ఏమైన సమస్యలు ఉంటే పరిశీలించి వాటిని సత్వరం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఏఈ హామి ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుర్రం లక్ష్మిమల్లు, తాటికొండ శంకర్, నీలం శ్రీనివాస్, బొమ్మగాని అనిల్ గౌడ్, తోట రాజుకుమార్ ఉన్నారు.

## గ్రూప్ వన్, గ్రూప్ టు అభ్యర్థులకు నష్టపరిహారం చెల్లించండి

**- పి వై ఎల్ జిల్లా కార్యదర్శి ఎన్ వి రాకేష్ డిమాండ్**



**ఖమ్మం/ తల్లాడ మే 22 (అక్షరంన్యూస్):** త టిఆర్ఎస్ ప్రభుత్వం లో నష్టపోయిన గ్రూపు 1, గ్రూప్ 2 అభ్యర్థులకు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, లక్ష అరవై వేల రూపాయలు నష్టపరిహారం చెల్లిస్తామని పిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, దానిని వెంటనే నిలబెట్టుకోవాలనీ పి వై యల్ ఖమ్మం జిల్లా కార్యదర్శి ఎన్ వి రాకేష్ బుధవారం డిమాండ్ చేశారు.గత పది సంవత్సరాల నుండి అభ్యర్థులు ఉద్యోగాలు రాక నిరుద్యోగ భృతి లేక దిక్కుతోచని పరిస్థితిలలో కాయ కష్టం చేస్తూ జీవిస్తున్నారని,పని చేద్దామన్న పని దొరకక నానా అవస్థలు పడుతున్నారని, ఎంతోమంది యువతి యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారనిఆయన ఆవేదన వ్యక్తం చేశారు.భవిష్యత్తులో ఇలాంటివి షాదఘ టనలు మరెన్ని జరిగే ప్రమాదమున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి, ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, నిరుద్యోగ యువకులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను గెలిపించండి

**- జావ్వాజి నాగరాజు**



**ఖమ్మం/వైరా మే 22 (అక్షరంన్యూస్):** నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ను భారీ మెజారిటీతో గెలిపించలి అని యువజన కాంగ్రెస్ నాయకులు జావ్వాజి నాగరాజు అన్నారు. బుధవారం నాగరాజు మాట్లాడుతూ తీన్మార్ మల్లన్నను గెలిపించి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా శాసనమండలికి పంపిస్తే పట్టభద్రుల సమస్యలపై అండగా ఉండే వ్యక్తిగా తీన్మార్ మల్లన్న ఉంటాడని పట్టభద్రులు ఒక్కసారి ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నాగరాజు అన్నారు.

## ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న ను గెలిపించండి

**- రాయల రాము**



**ఖమ్మం/తల్లాడ మే 22 (అక్షరంన్యూస్):** నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న ను భారీ మెజారిటీతో గెలిపించలి అనఎ జిల్లా కాంగ్రెస్ నాయకులు రాయల రాము అన్నారు. బుధవారం రాయల రాము ఒక ప్రకటనలో తెలుపుతూ తీన్మార్ మల్లన్నను గెలిపించి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా శాసనమండలికి పంపిస్తే పట్టభద్రుల సమస్యలపై అండగా ఉండే వ్యక్తిగా తీన్మార్ మల్లన్న ఉంటాడని పట్టభద్రులు ఒక్కసారి ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాయల రాము అన్నారు.

## వివిధ శాఖల పనితీరును పరిశీలించిన కేంద్ర ఎఎస్ఓల బృందం



**నాగర్ కర్నూల్ జిల్లా /తెల్కపల్లి/ మే 22(అక్షరం న్యూస్) :** మండల కేంద్రమైన తెల్కపల్లి కి స్టడీ టూర్ నిమిత్తం వచ్చిన ఆరుగురు కేంద్ర ప్రభుత్వ ఏ ఎస్ ఓ ల బృందం బుధవారం పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ శాఖ, ఎం జి ఎన్ ఆర్ ఇ జి ఎస్, పని ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు పని ప్రదేశాల్లో సౌకర్యాలు వేతనాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు, అనంతరం ఐ కే పి కార్యాలయం యందు మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి బ్యాంకుల నుండి అందుచున్న లోను వివరాలు, ఏర్పాటు చేసుకున్న యూనిట్ ద్వారా లబ్ది పొందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి వెటరినరీ ఆస్పత్రి, ఐసిడిఎస్ అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించడం జరిగింది. మిషన్ కాకతీయ పథకం క్రింద చేపడుతున్న పనుల వివరాలను సంబంధిత ఎఇ ని అడిగి తెలుసుకున్నారు . ఈ క్షేత్ర పరిశీలనలో శ్రీ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ) తో పాటు సంబంధిత అధికారులైన ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీవో, ఏపీయం ఐ కే పి , ఐ సి డి ఎస్ సూపర్వైజర్, వెటర్నరీ డాక్టర్, ఎఇ ఇరిగేషన్ పాల్గొన్నారు.

## పిల్లలతో సరదాగా క్రికెట్ ఆడిన గాంధీ బాపు



**రాజన్న సిరిసిల్ల/గంభరావుపేట/ మే 22(అక్షరం న్యూస్):** గంభీరావుపేట మండలం రాజేశ్వరరావు నగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో రాజేశ్వర్ నగర్ కు చెందిన చిన్నారులతో కలిసి అటుగా వెళ్తున్న గజసింగవరం మాజీ సర్పంచ్ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కో కన్వీనర్ కొండూరి గాంధీ బాపు చిన్నారులను వద్దకి వెళ్ళి చిన్నారులతో కలిసి సరదాగా ముచ్చటించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో పిల్లలతో కలిసి కొద్ది సేపు సరదాగా క్రికెట్ ఆడి,క్రికెట్ కిట్టు అందజేశారు,తర్వాత చిన్నారులను ఆప్యాయంగా మాట్లాడారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పిట్ల వెంకటి,బాలయ్య,ఆనందం ,నారాయణ పాల్గొన్నారు

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

**- పిడిఎస్యు రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్**
**- కార్పొరేట్, ప్రైవేటు ఫీజుల దోపిడీ నియంత్రించాలని డిమాండ్**




**ఖమ్మం/తల్లాడ మే 22 (అక్షరంన్యూస్):** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పి డి ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. స్థానిక ఖమ్మం నగరంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల ఆగడాలకు హద్దు అదుపు లేకుండా వ్యవహరిస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు దుయ్యబట్టారు.

ఎల్కేజీ నుండి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. టెక్నో, ఈ టెక్నో, ఐఐటి పేర్లతో తోక పేర్లను తగిలించి బోర్డులను ఏర్పాటు చేసి యదేచగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించడం కోసం టెస్టులు పెడుతూ అడ్మిషన్లు బహిరంగంగా నమోదు చేస్తున్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు నమోదు చేసి విద్యాసంస్థలలోనే పాఠ్యపుస్తకాలు అమ్మకాలు మొదలుపెట్టి విద్యాసంస్థలోనే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఫీజుల వివరాలను బోర్డులు ఏర్పాటు చేసి బహిరంగపరచాలని నిబంధన ఉన్న తుంగలో తొక్కుతున్నారు. స్కూలు ఫీజులు, అడ్మిషన్ ఫీజులు, బస్ ఫీజులు, హాస్టల్ ఫీజులు, దోబీ ఫీజులతో పాటు రకరకాల ఫీజుల పేరుతో డబ్బులు దండుకుంటున్న కనీసం అధికారులు పట్టించుకోని దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యా వ్యాపారాన్ని నియంత్రించకపోతే పి డి ఎస్ యు ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో పిడి ఎస్ యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి లక్ష్మణ్, వి వెంకటేష్, జిల్లా నాయకులు కరుణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఉద్యోగులపై జాతి వివక్ష చూపుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి..

**- గిరిజన మహిళ ఉద్యోగిని మానసికంగా వేధించినందుకు సుమోటో గా డీఈవో పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి...**
**- బీఈడీ విద్యార్హత లేని డీఈఓ ను వెంటనే తొలగించాలని నిరుపేద గిరిజన మహిళ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి పార్వతిని వెంటనే విధులలోకి తీసుకోవాలి...**
**- ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జెడి) వరంగల్, జిల్లా కలెక్టర్ కు విన్నపం...**
**- ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు బోడ రమేష్ నాయక్**



**మహబూబాబాద్ /గార్ల /మే 22/అక్షరం న్యూస్:** మహబూబాబాద్ కలెక్టర్ సమీకృత కార్యాలయంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గిరిజన ఉద్యోగుల పట్ల జాతి వివక్షత చూపుతూ, జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న గిరిజన మహిళ ఔట్సోర్సింగ్ అటెండర్ ఉద్యోగిని మానసికంగా వేధించి విధులనుండి తొలగించిన డీఈవో రామారావు ను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వరంగల్ ఆర్జెడి సత్యనారాయణ కు వినతి పత్రం అందజేసిన ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్. అనంతరం మాట్లాడుతూ, మహబూబాబాద్ అతి పెద్ద గిరిజన జిల్లా, ఈ గిరిజన జిల్లాలో అత్యధిక ఉద్యోగులు గిరిజనులు పనిచేస్తున్నారని వీరి పట్ల డి ఇ ఓ రామారావు వివక్ష చూపుతున్నారని అన్నారు.గత ఆరు నెలల క్రితం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అవుట్సోర్సింగ్ పద్ధతిన అటెండర్ గా పనిచేస్తున్న ధరంసోత్ పార్వతి అనే గిరిజన మహిళ ఉద్యోగిని డిఇఓ రామారావు మానసికంగా వేధించడం వలన ఆమె స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని,ఆ విషయాన్ని మనసులో పెట్టుకొని కక్ష సాధింపు చర్యగా ఆమెను ఈ విద్యా సంవత్సరానికి ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్టు చెప్పి విధులకు రావద్దని హుకుం జారీ చేశారు, అదేవిధంగా గత సంవత్సరంలో గూడూరు మండలంలో ఐదుగురు గిరిజన ఉద్యోగులను విధుల నుండి తొలగించడం జరిగిందని అన్నారు.ఉద్యోగులు ఎవరైనా చిన్నచిన్న తప్పులు చేసి ఉంటే మేమో రూపంలో కానీ నోటీసు రూపంలో గానీ మందలించడం కాకుండా ఎటువంటి నోటీసులు లేకుండా గిరిజన ఉద్యోగులు అంటేనే విధుల నుండి తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు.గత సంవత్సరంలో ఇదే లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ విషయంలో కానీ పర్మిషన్ లేని పాఠశాలల విషయంలో కానీ పర్మిట్లు లేని వాహనాల విషయంలో కానీ చాలాసార్లు విన్నవించిన చర్యలు తీసుకోకుండా కేవలం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంకు అనుకూలంగా వ్యవహారించారు.మహబూబాబాద్ గిరిజన జిల్లాలో విద్యాభివృద్ధి జరగకుండా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడు. బీఈడీ పట్టా లేని డీఈవో ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను, పిల్లలను ఏ విధంగా కోఆర్డినేషన్ చేయగలుగుతాడు అని దుయ్యబట్టారు. ఇలాంటి అర్హత లేని వారిని వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు.

ఈ విధంగా గిరిజనుల పట్ల జాతి అహంకారం ప్రదర్శిస్తూ గిరిజన మహిళ ఉద్యోగుల పట్ల మానసికంగా వేధిస్తున్నందున సుమోటోగా తీసుకుని డీఈవో పై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నిరుపేద గిరిజన మహిళ అవుట్ సోర్సింగ్ అటెండర్ ఉద్యోగి అయిన ధరంసోత్ పార్వతిని వెంటనే విదుల లోకి తీసుకోవాలని కోరారు. లేని పక్షాన మహబూబాబాద్ జిల్లాలో ఉన్న అన్ని సంఘాలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య బాలాజీ నాయక్, పట్టణ అధ్యక్షుడు హాతిరాం నాయక్ పాల్గొన్నారు.

# నిస్వార్థ ప్రజా సేవకుడు కామ్రేడ్ పర్సా సత్యనారాయణ



**- సిఐటియు ఆధ్వర్యంలో 8వ వర్ధంతి సభ**

**భద్రాద్రి కొత్తగూడెం /భద్రాచలం/ మే 22 /అక్షరం న్యూస్ :** నిస్వార్థ ప్రజా సేవకుడు కామ్రేడ్ పర్స సత్యనారాయణ అని ఆయన మార్గంలోని కార్మిక, ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సిఐటియు నాయకులు బండారు శరత్ బాబు, ఎం వి ఎస్ నారాయణ లు పిలుపునిచ్చారు. కార్మిక ఉద్యమ నిర్మాత స్వాతంత్రపోరాట యోధుడు అమర జీవీ కామ్రేడ్ పర్స సత్యనారాయణ 8వ వర్ధంతి సభ సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వై.వెంకట రామారావు అధ్యక్షతన జరిగింది. కామ్రేడ్ పర్సా సత్యనారాయణ చిత్రపటానికి సిఐటియు సీనియర్ నాయకులు ఎం వి ఎస్ నారాయణ పూలమాలవేసి నివాళు లు అర్పించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కామ్రేడ్ పర్స సత్యనారాయణ తన ఉద్యోగానికి సైతం రాజీనామా చేసి కార్మిక ఉద్యమ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. కామ్రేడ్ పరస సత్యనారాయణ ఉద్యమంలో పనిచేస్తున్న కార్మికుల పట్ల, కార్యకర్తల పట్ల శ్రద్ధ వహించే వారిని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో కామ్రేడ్ పర్సా సత్యనారాయణ తనదైన ముద్రవేశారని అన్నారు. కామ్రేడ్ పర్స సత్యనారాయణ కార్మికుల సమస్యల పట్ల పూర్తి అధ్యయనం నిర్వహించే వారిని అన్నారు. కామ్రేడ్ పర్సా ధన్యజీవి అని, ఆదర్శ జీవి అని ఆయన మార్గంలోని కార్మిక ప్రజా ఉద్యమాలు నిర్మించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గద్దం స్వామి, మురలీకృష్ణ, ముత్తయ్య, చెన్నుపాటి హమాలీ నాయకులు సాయి, మాస్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

# జడ్పీటీసీ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు

**- నాగం కుమార్-మమత పెళ్లిరోజున కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్న గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు**

**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, మే - 22 (అక్షరం న్యూస్):** /ఆర్సి/ ఇంచార్జ్/ తాటిపెల్లి నరసింహస్వామి :- రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన నాగం కుమార్. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అంటే కొంతమందే గుర్తుకొస్తారు ,కానీ ఒక యువ నేత గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.. ఎందుకంటే ఎవరైనా సరే వ్యాపారాలు చేసుకుంటూ రాజకీయం చేస్తారు కానీ ఈయన గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది అనేది పాత సామెత కానీ, ఈయన గురించి ఎంత ఎక్కువ మాట్లాడితే అంత మంచిది ఇది కొత్త సామెత ఎందుకంటే గత 20 సంవత్సరాలు నుంచి ఇప్పటివరకు ఫుల్ టైం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా తన రాజకీయాన్ని కొనసాగిస్తున్నాడు. అతడు ఎవరో కాదు చంద్రుర్తి జడ్పిటిసి నాగం కుమార్ 20 సంవత్సరాలు నుంచి కాంగ్రెస్ పార్టీని పట్టుకొని ఉన్నాడు..2014 - 2018 ఎలక్షన్లో లో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర%శ%లో అధికారంలోకి వచ్చిన స్థానిక మంత్రి కేటీఆర్ ని ఎదుర్కొని 2019 స్థానిక సంస్థ ఎన్నికల్లో అప్పటి టి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి అధికారాన్ని ఉపయోగించి డబ్బు మద్యం తో గెలవాలని ఎంత చేసిన నాగం కుమార్ టిఆర్ఎస్ పార్టీకి ఎదురు పోరాడి జిల్లా వ్యాప్తంగా ఒక్కోడే కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచి అప్పటి జిల్లా రాజకీయాల్లో సంచాలనం సృష్టించాడు. ఈ రోజులలో పూటకో కండువా కప్పుకునే నాయకులు ఉన్న పరిస్థితులలో స్వయంగా కేటీఆర్ తన సొంత జిల్లా కాబట్టి నాగం కుమార్ ని పార్టీలో జాయిన్ చేసుకోవాలని చాలా రకాలుగా ప్రయత్నం చేశారు కానీ నాగం కుమార్ (తల్లి ఒక్కటే నా పార్టీ ఒక్కటే అనే) సిద్ధాంతంతో బాధలను దిగమింగుకుంటూ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాడు. అంతేకాకుండా నిజాయితీపరుడు, విద్యావంతుడు, అతడు అందని కలుపుకుని పోయే గుణం ఉన్న నాయకుడు జిల్లాలో ఏ పార్టీ నాయకుని అలాగే ప్రజల ని అడిగిన కూడా చాలా మంచోడు అనే మాట వస్తది ఒక రాజకీయ నాయకునికి ఇంతకన్నా కావాల్సింది ఏముంది... ఇంత మంచి విలువలు కలిగిన నాయకుడు ఉన్నందుకు తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పరిస్థితులలో రానున్న రోజులలో ఒక రాష్ట్రస్థాయి పదవి ఇచ్చి గౌరవించాలని ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కోరుకుంటున్నారు.



Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609